


# విజయభాను

విశాఖపట్నం, బుధవారం 23-08-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 342 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యులకు

## ప్రభుత్వం తీపి కబురు



అమరావతి: ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యులకు ప్రభుత్వం తీపి కబురు అందజేసింది. వాళ్లకు శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందజేయడమే కాకుండా చట్టపరమైన హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేయబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్ నాలుగో బ్లాక్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా ఆర్.ఎం.పి, పి.ఎం.పి కష్టాలను గుర్తిస్తూ, ఎన్నికల మేనిఫెస్టోలో చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తానని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా ఏపీ పారామెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎం చంద్రబాబునాయుడిని కలిసి, తమ సమస్యలను విన్నవించారన్నారు. ప్రభుత్వ గుర్తింపు కోసం 40 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారన్నారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందిస్తూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్.ఎం.పి, పి.ఎం.పి.లకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడానికి అంగీకరించా రన్నారు. ఈ మేరకు మంగళవారం జీవో జారీచేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. ఆరు నెలల పాటు మెడికల్ కళాశాలలో శిక్షణతో పాటు 3 నెలలు ప్రభుత్వాసుపత్రుల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. మరో 3 నెలలు 104 చంద్రన్న సంచార వైద్య చికిత్స వాహనాల ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందజేయాలన్నారు. తరవాత పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులయిన వారికి గ్రామాల్లో వైద్య సేవలందించేలా గుర్తింపునిస్తూ ప్రభుత్వం సర్టిఫికెట్ అందజేస్తుందని మంత్రి కామినేని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, మన్యంలోనూ ఆర్.ఎం.పి, పి.ఎం.పి పారామెడికల్ సిబ్బంది వైద్య సేవలతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. చట్టహక్కులు కల్పిస్తూ, జీవో జారీ చేయడానికి సీఎం చంద్రబాబు సమ్మతించడంతో ఆర్.ఎం.పి, పి.ఎం.పి అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వెలిబుచ్చుతూ, కృతజ్ఞతలు తెలియజేశారని మంత్రి కామినేని తెలిపారు. అక్టోబర్ 2 తేదీన ఆర్.ఎం.పి, పి.ఎం.పి. అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని లయోలా కాలేజీ ఆవరణలో భారీ ఎత్తున మహాసభ నిర్వహించనున్నారని, దీనికి సీఎం చంద్రబాబునాయుడిని ఆహ్వానించారని మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ మాట్లాడుతూ, ప్రభుత్వ జీవోతో రాష్ట్రంలో 65 వేల మంది ఆర్.ఎం.పి., పి.ఎం.పిలకు మేలుకలుగుతుందన్నారు. జీవో జారీ చేయడంతో సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి కామినేని కృషి మరువలేనిదన్నారు. ఆయూష్ ఉద్యోగులకు త్వరలో జీతాలు అందజేయనున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి వెల్లడించారు. స్వచాంధ్ర కార్పొరేషన్ వైస్ ఛైర్మన్, తెలుగునాడు పారామెడికల్ కమ్యూనిటీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సీఎల్ వెంకట్రావు మాట్లాడుతూ, ఇప్పటికే 12 వేల మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని, వారికి నవంబర్ లో పునఃశ్చరణ శిక్షణ నిర్వహించి, డిసెంబర్ లో పరీక్షలు నిర్వహించ తరువాయి 2లో

### ముమ్మారు తలాక్‌పై

## సుప్రీం సంచలన తీర్పు

- పార్లమెంట్‌లో చట్టం తేవాలని ఆదేశం

తలాక్ తీర్పుపై మోదీ హర్షం



దిల్లీ: ఇస్లాం మతాచారమైన ముమ్మారు తలాక్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ముమ్మారు తలాక్ రాజ్యాంగ విరుద్ధమని, ఈ పద్ధతి చెల్లదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఖురాన్ నియమాలకు తలాక్ వ్యతిరేకంగా ఉందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయం వ్యక్తం చేసింది. దీనిపై పార్లమెంట్‌లో చట్టం తేవాలని ఆదేశించింది. ఆరు నెలల్లోగా చట్టం తీసుకురావాలని అప్పటివరకూ తలాక్‌పై నిషేధం విధిస్తున్నట్లు స్పష్టం చేసింది.

ఈ కేసును చీఫ్ జస్టిస్ ఖేహర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ ఐదుగురు భిన్న మతాలకు చెందిన వారు కావడం తరువాయి 2లో

## పన్నీర్ సెల్వంకు అదనపు బాధ్యతలు



చెన్నై: తమిళనాడు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఓ పన్నీర్ సెల్వంకు అదనపు మంత్రిత్వ శాఖలు కేటాయించారు. ఈ మేరకు గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆయనకు ప్రణాళిక, శాసనసభా వ్యవహారాలు, ఎన్నికలు, పాస్‌పోర్ట్ శాఖలు అదనంగా అప్పగించారు. ఇంతకుముందు ఈ శాఖలను డి. జయకుమార్ నిర్వహించారు. ఆయనకు మత్స్యశాఖ, సిబ్బంది మరియు పరిపాలన సంస్కరణల శాఖ కేటాయించారు. తన వర్గాన్ని తరువాయి 2లో

## అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలి : స్టాలిన్



చెన్నై: తమిళనాడులో రాజకీయ సంక్షోభం ముదిరిన నేపథ్యంలో శాసనసభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం కే స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్వాతంత్ర్య దినోత్సవాల్లో అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడిన మోదీ తమిళనాడులో రెండు అవినీతి వర్గాలు విలీనమయ్యేలా చేశారని, వారిని ఆశీర్వదించారని ఆరోపించారు. అన్నాడీఎంకేలోని పళనిస్వామి, పన్నీర్ సెల్వం వర్గాలు తరువాయి 2లో

### తలాక్ తీర్పుపై

## మోదీ హర్షం



ఢిల్లీ: ఇస్లాం మతాచారమైన ముమ్మారు తలాక్‌పై సుప్రీంకోర్టు మంగళ వారం సంచలన తీర్పు వెల్లడించింది. ఈ తీర్పుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ముమ్మారు తలాక్‌పై గౌరవనీయ మైన సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు చరిత్రాత్మకం. ఈ నిర్ణయం ముస్లిం మహిళలకు స్వాన్వాన్ని తీసుకొచ్చింది. మహిళాసాధికారతకు ఇదో నిదర్శనం అని ప్రధాని మోదీ తరువాయి 2లో

## ప్రైవేట్ సిటీ బస్సు కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి



అమరావతి : గుంటూరు నగరంలో ప్రయివేట్ సిటీ బస్సు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని పరష్కరించాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ హిదాయత్ రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి అచ్చెనాయుడును కోరారు. మంగళవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసిన హిదాయత్ నగరంలో సిటీ బస్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. నగరంలో గత 30 సంవత్సరాలుగా ప్రయివేట్ సిటీ బస్సుల మీద డ్రైవర్లుగా, కండక్టర్లుగా, క్లీనర్లుగా, సూపర్‌వైజర్లుగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్న 150 కుటుంబాలకు చెందిన 700 మంది కార్మికులు ఉన్నారని, ఇటీవల ఆర్‌టిసి వారు గరంలో ఆర్‌టిసి బస్సులు నడపడంతో వీరు ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. సిటీ బస్సు పర్మిట్లు ఉన్న రూట్లలో ఎటువంటి పర్మిట్లు లేకుండా ఆర్‌టిసి బస్సులు నడపటం చట్ట విరుద్ధమని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రయివేట్ బస్సులను జాతీయం చేసుకుని, కార్మికులను ఆర్టీసీ ఒప్పంద కార్మికులుగా తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రిని హిదాయత్ కోరారు. మంత్రి స్పందిస్తూ కార్మికులకు ఎటువంటి నష్టం జరగకుండా త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో గుంటూరు అంజుమన్ సంస్థ అధ్యక్షుడు మొహిద్దీన్, సిటీ బస్ కార్మికుల యూనియన్ నాయకులు బాబు, నరసింహారావు, అన్వర్, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

## మభ్యపెట్టడం..వెన్నుపోటు పొడవడం బాబుకే చెల్లింది

### వైకాపా నాయకురాలు లక్ష్మీపార్వతీ



సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా నాయకురాలు లక్ష్మీపార్వతీ

కాకినాడ : రాష్ట్ర ప్రజలను సాధ్యంకాని హామీలతో మభ్యపెట్టడం, వంచించడం, నమ్మినవారిని వెన్నుపోటు పోవడం ఏపీ సిఎం చంద్రబాబుకే చెల్లిందని వైకాపా నాయకురాలు లక్ష్మీపార్వతీ విమర్శించారు.

మంగళవారం ఎన్నికల కార్యాలయంలో మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం ఇస్తానన్న చంద్రబాబు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా తనయుడు లోకేష్‌కు మాత్రం మంత్రిపదవి కట్టబెట్టారని విమర్శించారు. చంద్రబాబు నాయుడుకు వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్యఅన్నారు. రాష్ట్రంలో హెరిటేజ్ తప్ప ఏ పరిశ్రమ అభివృద్ధి చెందలేదన్నారు. గత 9 సంవత్సరాల చంద్రబాబు పాలనలో వేల కోట్ల రూపాయలు దోపిడీ జరిగిందన్నారు.


నాటి కంటే నేడు చంద్రబాబు మరీ దిగజారిపోయాడన్నారు. స్థానిక ఎంఎల్ఏ వనమాడి కొండబాబు తన ఆస్తులు పెంచుకున్నారే తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఏలు గిడ్డి ఈశ్వరీ, మాజీ జెడ్పీ చైర్మన్ చెల్లుబోయిన వేణు,ఆకుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీం తీర్పు చరిత్రాత్మకం : యూపీ

లఖ్‌నవూ: ముస్లిం సామాజికవర్గంలో అమల్లో ఉన్న వివాదాస్పద విడాకుల విధానం ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం స్వాగతించింది. ఈ తీర్పు దేశ తరువాయి 2లో




### టేకిట్ ఈజీ



వాళ్లు హీరోలో.. జీరోలో.. ఇప్పుడేం తేల్చలేమని అంటున్నారు!!

### అమెరికా దాడుల్లో

## 42మంది మృతి



బీరుట్: సిరియాలోని ఐసిస్ ఉగ్రవాద స్థావరాలపై అమెరికా నేతృత్వంలోని బలగాలు వైమానిక దాడులు జరిపాయి. రక్కా నగరంపై జరిపిన ఈ దాడుల్లో దాదాపు 42 మంది పౌరులు మృతి చెందినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. వీరిలో 19 మంది చిన్నారులతో పాటు 12 మంది మహిళలు కూడా ఉన్నట్లు సమాచారం.

ఇటీవల సిరియాలోని వైర్ అల్‌జోర్ ప్రావిన్స్‌లో అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో 60 మంది పౌరులు చనిపోయిన విషయం తెలిసిందే. సిరియాలోని ఉత్తర భాగంలో తీవ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా అమెరికా దళాలు 2014 నుంచి దాడులు తరువాయి 2లో

### సర్దార్, దేవేంద్రలకు

## ఖేల్‌రత్న



న్యూఢిల్లీ : భారత పారా అథ్లెట్ దేవేంద్ర జఝురియాకు భారత అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ ఖేల్‌రత్న దక్కింది. రియో పారా ఒలింపిక్స్ లో జావెలిన్ తరువాయి 2లో



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కోరుతూ అవగాహన కలిగించేందుకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు గంట్యాడ శంకరరావు, వంకర ఆనంద్, పెద్దాడ పైడిరాజు, ఎం రామకృష్ణ, జి. శాంతకుమారి, మహమ్మద్ జామీలా, యర్ర గౌరీ, జి. ప్రసాద్, సత్యవతి, తోపుడు బండ్ల వ్యాపారస్తులు బాలాజీ, రమేష్ తదితరులు

# కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లోని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసుకొని సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ ఏక్షన్ కమిటీ ఇన్‌ఛార్జి డి. చంద్రశేఖర్, కన్వీనర్ ఎన్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెలుగునందిస్తున్న తమ జీవితాలను మాత్రం చీకటిలో కొనసాగిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్కడి విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను విలీనం చేసుకోవాలన్నారు. ఇక్కడ కూడా అదే రీతిలో తమకు రాని శాఖలు విలీనం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు తమ న్యాయమైన డిమాఇడ్లను పరిష్కరించాలని కోరుతూ నెల 28వ తేదీన ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 5 జిల్లాల విద్యుత్ కార్మికులు ఉదం 10 గంటలకు కళాభారతి ఆడిటోరియం నుంచి జరుగు బహిరంగ సభకు హాజరు కావాలని కోరారు. అనంతరం జరగబోవు శాంతియాత్ర ర్యాలీలో పాల్గొని విద్యుత్ సీఎండికి వినతిపత్రం సమర్పించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలోని జగదీష్, సంతోష్ కుమార్, ఎస్ చంద్రసేఖర్, రాజవర్మ, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ రహితంగా ఏయూ

ఆంధ్ర విశ్వవిద్యాలయం: ర్యాగింగ్ రహితంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం తీర్చిదిద్దడం జరుగుతోందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ మైక్రోబయాలజీ విభాగంలో నిర్వహిస్తున్న ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు తమ బాధ్యతను గుర్తెరిగి నడచుకోవాలన్నారు. వర్సిటీ గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించారు. వర్సిటీ కల్పించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ పరిమిత వనరులతో అపరిమిత ప్రగతిని సాధిస్తున్నారన్నారు. మెరుగైన అవకాశాలు సాధించాలని ఆకాంక్ష వ్యక్తంచేశారు. విభాగంలో శతశాతం ఉత్తీర్ణత కలిగి ఉండటం మంచి పరిణామమన్నారు. ప్రయోగశాలలను త్వరలో ఆధునీకరించడం జరుగుతుందన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.ఇ బాబు మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం తరగతులకు హాజరుకావాలన్నారు. అవకాశాలకు కొదవ లేదని వీటిని అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. మెడికల్ రంగంలో విద్యార్థులు రాణించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. సందేహాలు తరగతిగదిలో సత్వరం నివృత్తి చేసుకోవాలన్నారు. విభాగాధిపతి ఆచార్య పి.కె రత్నకుమార్ తదితరులు ప్రసంగించారు.

# చంద్రన్న బీమా

## పేద కుటుంబాలకు కొండంత భరోసా

## రూ. 50 లక్షల బీమా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం: చంద్రన్న బీమా.. పేద కుటుంబాలకు కొండంత భరోసా అందిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు. దొండపర్తి పరదేశమ్మ ఆలయం వద్ద మంగళవారం 15వ వార్డు, 31, 44వ వార్డుల ప్రజలచే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 31వ వార్డు రైల్వే న్యూకాలనీకి చెందిన విరోతీ కుమారికి రూ. 5 లక్షల బీమా చెక్కును అందజేశారు. వారి పిల్లల చదువు నిమిత్తం సొంద నిధులు రూ. 2,500 అందించారు. నిరుపేద కుటుంబానికి చంద్రన్న బీమా ఎప్పుడూ ఆదుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చంద్రన్న బీమాను పేద కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారి రమణమూర్తి, 15వ వార్డు అద్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, వీరబుజ్జి, తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యలపై నిబద్ధతతో పనిచేయండి...

## - స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



చోడవరం: ప్రజల సమస్యలపై నిబద్ధదతతో పనిచేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు అధికారులు, ప్రజాప్రతి నిధులకు సూచించారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో మంగళవారం ఎం.పి.డి.ఒ. జి.వి.చిట్టిరాజు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లా డుతూ ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిదులు రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ప్రజల సంక్షేమం కోరి ప్రభుత్వాలు చేస్తున్న పధకాలన్నీ ప్రజలకందజేసే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపైననే ఉందని తెలియజేసారు. రాజకీయాలకోసం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు వాదులాడుకొని, ప్రభుత్వ నిధులు వెనక్కి మళ్లించటం న్యాయం కాదని, దీని వలన స్థానిక నేతలపై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. సర్పంచులు, ఎం.పి.టి.సిలు లేవదీస్తున్న ప్రజా సమస్యలపై మినిట్సు పుస్తకంలో నమోదు చేయాలని, దీని కారణంగా గత సమావేశపు సమస్యల పరిష్కారం తెలుసుకోవడం సులభతరమవుతుందని తెలిపారు. మండలంలో వ్యక్తిగత మరుగు దొడ్లకుగాను ఇప్పటివరకు రూ.3.39 లక్షల రూపాయిలు చెల్లింపులు జరిపినట్లు ఎం.పి.డి.ఒ తెలియజేసారు. మండలంలో నిర్మాణంలో ఉన్న 19 అంగన్వాడీ భవనాలకుగాను ఒక్కోదానికి రూ.50,000లు చొప్పున ఈ.ఈ.పి.ఆరు అక్కౌంటుకు ఆయా గ్రామ సర్పంచులు జమచేయాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారంటూ గౌరీపట్నం, అంభేరుపురం ఎం.పి.టి.సిలు కోన చంద్రరావు తదితరులు అధికారులను నిలదీసారు. గ్రామాల్లో స్వచ్ఛభారతు కోసం 'చెత్త నుండి సంపద' కేంద్రాలు ఏర్పాటు చేయవలసిందిగా జిల్లా రీసోర్సు(డి.పి.ఆర్సీ) ఎను.సంతోషం తెలియజేసారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మండలంలో ఇప్పటివరకు 20 శాతం మాత్రమే వరినాట్లు అయినట్లు మండల వ్యవసాయాధికారి ఈ.ఆరు.ఏ.శ్రీనివాసు తెలియజేసారు.

32 గ్రామ పంచాయితీల్లో కేవలం 67 మంది మాత్రమే ఫసలుభీమా చేసినట్లు ఎ.ఒ. తెలపటంతో ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేసారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలు, సమస్యలపై ప్రతిపక్షనేతల సమాధానాలకు అధికారులు నీళ్లు నమలడంతో సమావేశం వాడివేడిగా సాగింది. ప్రజా సంక్షేమం కోసం అధికారులు, ప్రజాప్రతినిదులు సమయపాలన, క్రమశిక్షణతో మెలగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందిగా ఎమ్మెల్సీ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు టి.రవి, ఎం.పి.పి గూనూరు కొండతల్లి, వైసు ఎం.పి.పి. భూతనాధు నానీకుమారు, జెడ్పీటిసి కనిశెట్టి మత్స్యరాజు, వ్యవసాయ మార్కెటు కమిటీ ఛైర్మను మజ్జి గౌరీశంకరు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎం.పి.టి.సి.లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ముమ్మారు తలాక్‌పై సుప్రీం సంచలన తీర్పు

విశేషం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహార్(సిక్కు మతం), న్యాయమూర్తులు జస్టిస్ కురియన్ జోసఫ్(క్రైస్తవ), జస్టిస్ నారిమన్(పార్శీ), జస్టిస్ లలిత్(హిందూ), జస్టిస్ అబ్దుల్ నజీర్(ముస్లిం)లతో కూడిన ధర్మాసనం నేడు తలాక్‌పై విచారణ చేపట్టింది. ఇందులో న్యాయమూర్తులు కురియన్, లలిత్, నారిమన్‌లు ముమ్మారు తలాక్‌ను వ్యతిరేకించారు. ముమ్మారు తలాక్ రాజ్యంగ విరుద్ధమని.. ఇస్లాం దేశాల్లోనే దీన్ని నిషేధించినప్పుడు భారత్‌లో ఎందుకు కొనసాగించాలని అన్నారు. ముమ్మారు తలాక్ సమానత్వ హక్కును అతిక్రమిస్తోందని అభిప్రాయపడ్డారు. కాగా.. చీఫ్ జస్టిస్ ఖేహర్, జస్టిస్ నజీర్ మాత్రం తలాక్ అంశాన్ని పార్లమెంట్‌కే వదిలేస్తున్నట్లు చెప్పారు. అది దశాబ్దాల నాటి ఆచారమని.. దానిపై న్యాయస్థానం జోక్యం చేసుకోదని ఖేహర్ అన్నారు.అయితే ముమ్మారు తలాక్‌పై పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం చట్టం తెచ్చేంత వరకు ఎలాంటి పిటిషన్లు తీసుకోబోమని స్పష్టం చేసింది. చట్టం చేసిన తర్వాతే దానికి లోబడి కేసులను విచారిస్తామని పేర్కొంది. చట్టం చేయడానికి కేంద్రానికి ఆరు నెలల గడువిచ్చింది.

అప్పటివరకూ ముమ్మారు తలాక్ చెల్లుబాటు కాదని స్పష్టం చేస్తూ దానిపై నిషేధం విధించింది. ఆరు నెల్లలోపు చట్టం తీసుకురాకపోతే నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. షరియా చట్టాలను పరిగణనలోకి తీసుకొని చట్టం చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచనలు చేసింది. చట్టం చేసే సమయంలో ముస్లిం సంఘాల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని సూచించింది. దీనిపై రాజకీయ పక్షాలన్నీ కేంద్రానికి సహకరించాలని తెలిపింది. వాట్సాప్, సోషల్‌మీడియా, పోస్టుకార్డు, న్యూస్‌పేపర్ ద్వారా ముమ్మారు తలాక్ చెప్పి భార్యలకు విడాకులిస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. దీంతో ముమ్మార్ తలాక్ న్యాయబద్ధం కాదని, దాని వల్ల తాము జీవితాలను కోల్పోతున్నామని ముస్లిం మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 1400 ఏళ్ల నాటి మతాచారంపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. మహిళల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ముమ్మారు తలాక్ పద్ధతి ఉందని.. ఈ విధానాన్ని తొలగించేలా చట్టం తీసుకురావాలని పిటిషన్‌దారులు కోరారు. అయితే పిటిషన్లపై ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. మత సంబంధమైన వ్యవహారాలపై కోర్టు జోక్యం సరికాదని చెప్పింది. దీనిపై పలుమార్లు విచారణ చేపట్టిన న్యాయస్థానం.. నేడు సంచలన తీర్పు వెల్లడించింది.

## తలాక్ తీర్పుపై మోదీ హర్షం

ట్వీట్ చేశారు. సుప్రీం తీర్పుపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆనందం వ్యక్తం చేసింది. తీర్పును స్వాగతిస్తున్నట్లు పేర్కొంది.

ముమ్మారు తలాక్ రాజ్యంగబద్ధం కాదని, ఆరు నెలలపాటు దానిపై నిషేధం విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. దీనిపై ఆరు నెలల్లోగా చట్టం తీసుకురావాలని.. లేని పక్షంలో నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. సుప్రీం తీర్పుపై పిటిషనర్ ష్యారా బానో సహా ముస్లిం మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

## పన్నీర్ సెల్వంకు అదనపు బాధ్యతలు

అధికారిక అన్నాడీఎంకేలో పన్నీర్ సెల్వం విలీనం చేశారు. దీంతో ఆయనతో పాటు కే పాండియన్‌కు మంత్రి పదవులు దక్కాయి. నిన్న సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే డిప్యూటీ సీఎంగా పన్నీర్ సెల్వం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయనకు ఆర్థిక, గృహ, గ్రామీణ గృహ నిర్మాణం, మురికివాడల నిర్మూలన, పట్టణాభివృద్ధి, చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ శాఖలను కేటాయించారు. పాండియన్ తమిళనాడు అధికార భాష, సంస్కృతి సంప్రదాయాల శాఖలను దక్కించుకున్నారు.

## అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలి : స్టాలిన్

విలీనమైన నేపథ్యంలో శశికళ వర్గం తిరుగుబాటు బావుటాను ఎగురవేసిన సంగతి తెలిసిందే. 19 మంది ఎమ్మెల్యేలు తమిళనాడు గవర్నర్ విద్యాసాగర్ రావును కలిసి పళని స్వామి ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వం మైనారిటీలో పడింది. ప్రస్తుతం అందరి చూపులూ గవర్నర్ విద్యాసాగర్ రావుపైనేపడ్డాయి. ఆయన శాసనసభలో బలపరీక్షకు పళని స్వామి ప్రభుత్వాన్ని ఆదేశిస్తారా, లేదా? అని అందరూ ఎదురు చూస్తున్నారు.

## సుప్రీం తీర్పు చరిత్రాత్మకం : యూపీ

సెక్యులర్ పునాదులను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని, ఖురాన్ నియమాలకు వ్యతిరేకంగా ఉందంటూ సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడుతూ ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించిందని రాష్ట్ర వె%ద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ప్రభుత్వ అధికార ప్రతినిధి సిద్ధార్థనాథ్ సింగ్ మీడియాకు తెలిపారు. ముస్లిం మహిళలు తమ హక్కుల సాధనకు చేపట్టిన ఈ న్యాయ పోరాటానికి మద్దతుగా నిలిచారంటూ ప్రధాని నరేంద్ర మోదీకి యూపీ మంత్రి అనుపమ జైస్వాల్ కృతజ్ఞతలు తెలిపారు.

## అమెరికా దాడుల్లో42మంది మృతి

చేస్తున్నాయి. ఈ దాడుల్లో వందలాది మంది సామాన్య పౌరులు మృత్యువాత పడుతున్నారు. దీనిపై సిరియా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## సర్ధార్, దేవేంద్రలకు ఖేల్‌రత్న

త్రోయర్ అయిన దేవేంద్ర జఝురియా రెండు స్వర్ణాలు గెలుపొంది సత్తా చాటాడు. దాంతో ఖేల్ రత్న అవార్డుల సిఫారుసులో దేవెంద్ర తొలి ప్రాధాన్యత దక్కించుకున్నాడు. అయితే 25 ఏళ్ల చరిత్ర ఉన్న ఖేల్ రత్న అవార్డును ఓ పారాలింపియన్ అందుకోవడం ఇదే తొలిసారి కావడం ఇక్కడ విశేషం.


మరొకవైపు దశాబ్ద కాలానికిపైగా భారత హాకీకి సేవలందిస్తున్న సర్దార్ సింగ్ కూడా ఖేల్ రత్న దక్కింది. ఈ మేరకు 2017 ఏడాదికి గాను కేంద్ర ప్రభుత్వం మంగళవారం క్రీడా పురస్కారాలు ప్రకటించింది.

## ఆర్‌ఎంపి, పీఎంపి వైద్యులకు ప్రభుత్వం తీపి కబురు

నున్నారన్నారు. ఏపీ పారామెడికల్ అధ్యక్ష కార్యదర్శులు రాజా సిద్ధార్థ, కెరెళ్ల గణపతి, పిఎస్పీ పట్నాయక్, యల్.అచిరెడ్డి, జీయస్. ప్రసాద్, వివి. కృష్ణారావు, పదిలం బెన్నబాబు, ఆకాశం గౌరీషు బాబు, కంబాల బాబురావు, రఫీ, జోషి, గోపాల్, చిరంజీవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవద్దు

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం



కిర్లంపూడి : కాపులకు రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని, కాపు బిడ్డలకు మంచిరోజులు తీసుకొస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలో ఉందని, ఇప్పుడు ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే జాతి కోలుకోలేనంత వెనకబడిపోతుందని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. సోమవారం కిర్లంపూడిలో 27వ రోజు ఐకాస రాష్ట్రనాయకులు, కాపుసంఘాల నాయకులు, మహిళలతోకలసి ముద్రగడ పాదయాత్రకు బయలుదేరారు. గేటువద్ద పోలీసులు అడ్డగించడంతో అందరూ అక్కడే కూర్చుని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్ష కొనసాగించారు. పశ్చిమగోదావరి, విశాఖ, కృష్ణాజిల్లాలోని వివిధ మండలాల తోపాటు జిల్లాలోని అనపర్తి, పిఠాపురం ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, తుని, రాజమహేంద్రవరం, కాకినాడ నియోజకవర్గాల పరిధిలోని పలుగ్రామల నుంచి కాపుసంఘాల నాయకులు, మహిళలు నిరసన తెలుపుతూ కిర్లంపూడి చేరుకుని ముద్రగడకు సంఘీభావం ప్రకటించారు. నిరసన శిబిరంలో సాయంత్రం వరకు కూర్చున్నారు. కిర్లంపూడి మండలంలోని ఏటిపట్టు గ్రామాల నుంచి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో భారీసంఖ్యలో కాపుసంఘాల నాయకులు నల్లజెండాలను పట్టుకుని మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పెద్దపూడి, రంగంపేట మండలాల నుంచి మార్కెట్ కమిటీ మాజీఛైర్మన్ అద్దంకి ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో కాపు సంఘాల నాయకులు, కార్యకర్తలు కిర్లంపూడి చేరుకుని పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం మాట్లా డుతూ కాపులు అందరూ ఏకతాటిపైకి వచ్చి జాతిప్రయోజనాల కోసం పోరాడాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అందరూ రిజర్వేషన్లు పొందారని స్వాంతత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న రిజర్వేషన్లను కాపులు కోల్పోయా రన్నారు. ఈ పరిస్థితుల నుంచి బయట పడేందుకు రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిందిగా సూచించారు. కాపుల ఉద్యమ తీవ్రతను తట్టుకోలేక ముఖ్యమంత్రి వెంటనే రిజర్వేషన్లు ప్రకటించే వరకు అందరూ రోడ్డుఎక్కి శాంతియుత మార్గంలో పోరాటం సాగించాలన్నారు. అమరావతికి పాదయాత్రకు ప్రభుత్వం అనుమతి ఇచ్చేవరకు కాపులంతా చలో కిర్లంపూడి కార్యక్రమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐకాస నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాష్, గౌతు స్వామి, గుండా వెంకటమరణ, గోపు అచ్చుతరామయ్య, కర్రి సత్తిరాజు, గౌతు సుబ్రమణ్యం మంగెన రామయ్య, సంగిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు




పాయకరావుపేట : ప్రముఖ సినీ నటుడు, రాజకీయ నాయకుడు, పద్మభూషణ్ ,డాక్టర్ చిరంజీవి 63 వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక చిరంజీవి అభిమాన సంఘం గౌ.అధ్యక్షులు గూటూరు శ్రీను ఆధ్వర్యంలో పలువురు అభిమానులు స్థానిక పిహెచ్ సికి వెళ్ళి అక్కడి రోగులకు పాలు,రొట్టె,పండ్లు పంపిణి చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించిన చిరంజీవి జీవితం మనందరికీ ఆదర్శప్రాయ మన్నారు.సినిమాల ద్వారా ప్రజల మన్ననలందుకున్న మెగాస్టార్ నిజ జీవితంతో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి మంచి మానవతావాదిగా నిలిచారన్నారు. భవిష్యత్ లో రానున్న చిరంజీవి సినిమాలు యువతకు సందేశాన్ని స్తూన్నే అన్ని వర్గాలను అలరించే సినిమాలతో ప్రజల ఆదరాభిమా నాలను చూరగుంటారనటంలో సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అల్లు అప్పారావు,పెంకే శ్రీను,అభిమానులు రాజా రమేష్ , దుర్గారావు, ఐ.ఎన్ మూర్తితోపాటు పలువురు పాల్గొన్నారు.అలాగే నక్కపల్లి,ఎస్ రాయవరం, కోట వురట్ల మండలాల్లోని పలు గ్రామా ల్లో చిరంజీవి అభిమానులు మెగా స్టార్ జన్మదిన వేడుకలను అట్టహా సంగా నిర్వహించి తమ అభిమాన నటుడిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## తట్టు, పొంగును అంతం చేద్దాం

### జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిణి మధుశ్రీ

చిన్నమల్లారెడ్డి : తట్టు, పొంగును అంతం చేద్దామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి మధుశ్రీ పేర్కొన్నారు. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి, తిమ్మక్‌పల్లి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి మాట్లాడుతూ... ప్రభుత్వం టీకాను ఉచితంగా వేస్తోందన్నారు. తట్టు, పొంగు అంటువ్యాధులని వివరించారు. పిల్లల్లో వ్యాధినిరోధక శక్తిని తగ్గిస్తుందని చెప్పారు. జిల్లాలో 1.45 లక్షల మంది విద్యార్థులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఇది పూర్తి ఆరోగ్యవంతమైన టీకా అని పేర్కొన్నారు. నెల రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్య క్రమంలో సర్పంచులు రామాగౌడ్, జయశ్రీ, మాణిక్యశర్మ, రాంచంద్రం, శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## 1న విద్రోహ దినంగా పాటిస్తూ నిరసనలు



ఆదిలాబాద్ : కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని అమలు చేసిన సెప్టెంబర్ 1వ తేదీని విద్రోహ దినంగా పాటిస్తూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నేతలు పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో గోడప్రతులు విడుదల చేశారు. టీఎస్ యూటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకట్ మాట్లాడుతూ సీపీఎస్ విధానం అమలుతో రాష్ట్రంలో 1.20లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాల భద్రత అగమ్య గోచరంగా మారిందని పేర్కొన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని పలుమార్లు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగ సంఘాలన్నీ ఏకతాటిపై వచ్చి సీపీఎస్ రద్దు కోసం పోరాడాల్సిన అవసరముందని తెలిపారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 1రోజున నల్లబ్యాడ్జీలు ధరించి పాలనా ప్రాంగణం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, డీటీఎఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తొడసం శ్రీనివాస్, బి.వృకోధర్, ఆయా సంఘాల నేతలు విఠల్‌గౌడ్, సూర్యకుమార్, ఇస్తారి, సుధాకర్, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యంతో ఫొటోగ్రఫీలో రాణింపు: ఏసీపీ

సిద్దిపేట : ఫొటోగ్రఫీ వృత్తి కళాత్మకతతో కూడుకుందని, రాణించాలంటే నైపుణ్యం ఉండాలని ఏసీపీ నర్సింహారెడ్డి అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణ ఫొటో-వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రూరల్ పోలీసు ఠాణా నుంచి స్థానిక పటేల్ గార్డెన్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఏసీపీ అసోసియేషన్ ప్రతినిధులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ వృత్తితో జ్ఞాపకాలను పదిలంగా దాచి భవిష్యత్తు తరాలకు అందించవచ్చన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధికి ఐకమత్యంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర కన్వీనర్ శైలేందర్, ప్రతినిధులు కాశీరత్నం, ఓంకార్, అభిమాన్యురెడ్డి, ఓంప్రకాశ్, శేఖర్, పురుషోత్తం, చంద్రనారాయణ, సాగర్, ప్రభుదాస్, మురళి, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

సిద్దిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత రంగంలో రాణిస్తూ సేవలు అందిస్తున్న వారిని సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ.. సృజనతో ఫొటోగ్రఫీ రంగంలో రాణించవచ్చన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఫొటోగ్రఫీకి ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. క్లబ్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శేఖర్, భగవాన్‌దాస్, గంప రమేశ్, రామచంద్రం, వేణు, సుభాష్ ఉన్నారు.

## రాజ్యాంగపర హక్కులను హరిస్తున్నారు

ఎదులాపురం : రాజ్యాంగపరంగా, చట్టపరంగా సంక్రమించిన హక్కులను సైతం పాలక ప్రభుత్వాలు కాలరాస్తూ రాజ్యాంగాన్ని సైతం దిక్కరిస్తున్నాయని మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు ఆరోపించారు. ఈ నెల 27న ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న మానవ హక్కుల వేదిక ఆరవ మహాసభ కరపత్రాలను స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో ఆయన విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో గిరిజన ప్రాంతాల్లో ఓపెన్‌కాస్ట్ గనులు ఏర్పాటు చేస్తూ వారికి నిలువ లేకుండా చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం వారికి అందించాల్సిన కనీస తాగు నీరు, వైద్యం, విద్యను సైతం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కుల ఉల్లంఘన, భవిశ్యత్తు కార్యాచరణ గురించి చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడానికి మహాసభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారంతా కూడా ఇందులో పాల్గొని సూచనలు, సలహాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు యస్.మల్లేష్, రైతు స్వరాజ్యవేదిక అధ్యక్షుడు బుర్రన్న, వేదిక మహిళా ప్రతినిధి సుగుణ, ఆర్,శ్రీను, టీ.శ్రీను, కనక వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాన్ని ప్రకటించాలి



ఆలేరు : నార్మాక్స్ పరిధిలోని పాల ఉత్పత్తి దారులకు లీటరుకు రూ.4ల పోత్సాహకాన్ని ప్రకటించాలని ఆలేరు పాల శీతలీకరణ కేంద్రం పరిధి పాల సొసైటీల ఛైర్మన్ల సంఘం అధ్యక్షుడు ననబోలు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పాలసొసైటీ ఛైర్మన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విజయ డెయిరీకి ఇస్తున్నట్లుగానే లీటరుకు రూ.4ల ప్రోత్సాహకాన్ని నార్మాక్స్ పరిధిలోని పాల ఉత్పత్తి దారులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రోత్సాహకాన్ని ప్రకటించక పోవడంతో నార్మాక్స్ పరిధిలోని పాల ఉత్పత్తిదారులు ప్రైవేటు డెయిరీల వైపు మల్లుతున్నారని చెప్పారు. ప్రభుత్వం కరుణిస్తే 75వేల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోంద న్నారు. లీటరుకు రూ.4 ప్రోత్సాహకాన్ని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మాణించారు. ఛైర్మన్లు దొంతిరి సోమిరెడ్డి, ఎం.సోమయ్య, డి.శేఖర్‌రెడ్డి, ఎస్.వెంకట నర్సింహారెడ్డి, పి.సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ - కార్యాలయం అన్ని శాఖలకు విస్తరించాలి



మహబూబ్‌నగర్ : కాగిత రహిత పాలనకు పాలమూరులో చేపట్టిన ఈ-కార్యాలయం అభినందనీయమని ఈ- కార్యాలయం ప్రాజెక్టు మేనేజరు మేఘారాణి అన్నారు. ఆమె దిల్లీ నుంచి జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్, జిల్లా అధికారులతో దూరదృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు ఈ-కార్యాలయం విస్తరించాలన్నారు. అనంతరం ఈఎండీ, ఈ-ఫైలింగ్, తదితర అంశాలపై వివరాలు సేకరించారు. జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ మాట్లాడుతూ ఈ-కార్యాలయంలో మరిన్ని అంశాలు పొందు పర్చాల్సి ఉందన్నారు. స్పెసిమెన్ సిగ్నేచర్, బ్యాంకు లావాదేవీలు ఈ-కార్యాలయం ద్వారానే జరిపేలా కొత్త విధానాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కలెక్టరేట్‌తో పాటు సీపీవో, డీపీవో కార్యా లయాల్లో ఈ-కార్యాలయం ప్రారంభించామన్నారు. నారాయణపేట ఉప కలెక్టర్ కార్యాలయం, మహబూబ్‌నగర్ ఆర్డీవో కార్యాలయాల్లోనూ ఈ విధానాన్ని విస్తరించి అనంతరం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపడు తున్నామని తెలిపారు. సమావేశంలో ఎన్‌ఐసీ డీఐవో ఎం.సత్య నారాయణమూర్తి, ఏడీఐవో బండి రవి, ఎల్‌డీఎం ప్రభాకర్‌షెట్టి, కలెక్టరేట్ ఏవో ప్రేమ్‌రాజ్, ఈఎండీ వాసుదేవరావు, ఈడీఎం మాదాసు కిశోర్, ఎన్‌ఐసీ సాంకేతిక సహాయకులు కిశోర్, నరేష్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు తీర్చే వరకు సమ్మె విరమించం

మెట్టుగడ్డ : ఏళ్ల నాటి తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని గ్రామీణ తపాలా ఉద్యోగులు తేల్చి చెప్పారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మహబూబ్‌నగర్‌లోని ప్రధాన తపాలా శాఖ కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగుతున్నది. జిల్లా నలుమూలల నుంచి పాల్గొన్న జీడీఎస్‌లు పట్టణంలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. తపాలా కార్యాలయం నుంచి పాతబస్టాండ్ మీదుగా గడియారం చౌరస్తా చేరుకున్నారు. అనంతరం అక్కడి మహాత్మగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడినుంచి తిరిగి పాతబస్టాండ్, బోయపల్లిగేటు, తెలంగాణ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ పెద్దఎత్తున మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జీడీఎస్‌ల సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కిషన్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయకార్యదర్శి ఉమాకాంత్, వెంకటేశ్, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులపై చూపుతున్న వివక్షను విడనాడాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు వేణుగోపాలచారి, అంజన్న, నరేశ్‌గౌడ్, సేవ్య, వెంకటేశ్, రవికాంత్, వేణు, తిరుపతయ్య, బాలస్వామి, గోవర్ధన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పలువురి మద్దతు : గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు పలు సంఘాలు, వివిధ పార్టీల నాయకులు మద్దతు ప్రకటించారు. డీసీసీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.కురుమూర్తి, బుస్స చంద్రయ్యలు పాల్గొని సంఘీభావం తెలిపారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను వెంటనే నెరవేర్చాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లు వచ్చేవరకు విశ్రమించొద్దు

కొత్తగూడెం : బీసీ సంఘాల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలు ఎక్కువ శాతం మంది ఉన్నా.. రాజకీయ, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరుగుతూనే ఉందని అన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే రిజర్వేషన్ రావాలని, బిల్లు సాధించుకునేంత వరకు పోరాటం ఆపొద్దని పిలుపునిచ్చారు.

కొత్తగూడెంలోని ప్రగతినగర్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత సంఘం నాయకులపై ఉందన్నారు. సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. బీసీ కులాలన్ని ఏకతాటిపైకి వచ్చి పోరాడినప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. జనాభాలో అధిక శాతం బీసీ కులాలే ఉన్నా అన్ని రంగాల్లో వారికి సంపూర్ణ న్యాయం జరగడం లేదన్నారు. బీసీల రాజ్యాధికారం రావాలంటే బీసీలోని అన్నీ కులాలు ఏకం కావాలని అప్పుడు హక్కులు సాధించుకోగలుగుతామన్నారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీ లంతా ఐక్యంగా కలిసి పోరాడితే సాధించలేనిదేదీ లేదన్నారు. మున్సిపల్ వె%ఎస్ చె%ర్మన్ రావి రాంబాబు మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందన్నారు.


పార్టీలకతీతంగా బీసీ కులాలన్నీ ఏకం కావాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముదురుకోళ్ల కిషోర్, గౌరవ సలహాదారుడు కొమరయ్య, కోశాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి లింగిశెట్టి వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పిండిపోళ్ల రామ్మూర్తి, తెలంగాణ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రామనాథం, బీసీ సంఘం నాయకులు దూడల బుచ్చయ్య, జ్వలిత, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సమస్యలను పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

కొత్తగూడెం : పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను, బోధన రుసుం బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శనను నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతుందని విమర్శించారు. బడ్జెట్‌ను విడుదల చేసినా ట్రెజరీల్లో ఫ్రీజింగ్‌లో ఉంచటంతో విద్యార్థుల ఖాతాల్లోకి డబ్బులు రాలేదని ఆరోపించారు.

## రైతుల సంస్కృతి చిహ్నం పొలాల పండగ

### ఆదిమ గిరిజన సలహా సంఘం ఛైర్మన్ కనక లక్కేరావు



ఇంద్రవెల్లి : దేశానికి వెన్నెముకగా రైతులని, రైతులకు వెన్నెముకగా ఉండే ఎద్దులు పండగ అయిన పొలాల సంస్కృతికి చిహ్నమని ఆదిమ గిరిజన సలహా సంఘం ఛైర్మన్ కనక లక్కేరావు అన్నారు. పొలాల పండగను స్వంత గ్రామమైన ముత్నూర్ లో పండగను జరిపారు.

ఈ సందర్భంగా ఎద్దులను అలంకరణ చేసిన రైతులకు ప్రథమ బహుమతిగా రూ.3001, రెండవ బహుమతిగా రూ.2001 నగదు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో చేదోడు, వాదోడుగా ఉండే ఎద్దులను పొలాల పండగ రోజున అలంకరణ చేయడం, ఎద్దుల కోసం ప్రత్యేకంగా నైవేద్యం వండి తినిపించడం సంస్కృతిలో భాగమన్నారు. కంప్యూటర్ యుగంలో యంత్రాలతో వ్యవసాయ పనులు చేయడం వల్ల చాలమంది రైతులు ఎద్దులను పూజించడం మరిచి పోయారని అన్నారు.

మారుమూల ఈ పండగను ప్రజలు భక్తి శ్రద్దలతో జరుపుకోవడం అభినందనీమని అన్నారు. ఆయనతో పాటు గ్రామ పటేల్ హెరకుంర జంగు, కే.గణేష్ పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దుకు 1న మూకుమ్మడి సెలవు

ధన్వాడ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు1న మూకుమ్మడి సెలవులు పెడుతున్నట్లు టీఎస్ సీపీఎస్(ఈఎస్) జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన సీపీఎస్ పరిధిలోకి వస్తున్న పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో సామాజిక భద్రత లోపించి భవిష్యత్‌పై భయాందోళనలు నెలకొంటున్నాయన్నారు. తక్షణమే దీనిని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం సరియైన రీతిలో స్పందించని కారణంగా ఒకటో తేదీన నిర్వహించ తలపెట్టిన మూకుమ్మడి సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వీరు అందరూ వచ్చే నెల ఒకటిన సెలవు కోరుతూ సంబంధిత అధికారికి అర్జీలు సమర్పించారు.

## ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలి

ఆదిలాబాద్ : రానున్న గణేశ్ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిరకాల ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పోలీసులకు రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ సూచించారు. ఈ మేరకు ఆయన దృశ్య శ్రవణ మాధ్యమంలో ఆదిలాబాద్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి, నిర్మల్ జిల్లా ఇన్చార్జి ఎస్పీ శ్రీనివాస్, ఇతర అధికారులతో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో 1787 వినాయక విగ్రహాలను ఈ సంవత్సరం ప్రతిష్టిస్తున్నారని, అందులో 561 మండపాలు సమస్యాత్మకమైనవని, 1226 సాధారణ ప్రాంతాల్లో ఉన్నాయని ఎస్పీ శ్రీనివాస్ డీజీపీకి వివరించారు. నిర్మల్ జిల్లాలో 1900 గణేష్ మండపాలు ఉండగా, అందులో 524 సమస్యాత్మకమైనవి, 1376 సాధారణ ప్రదేశాల్లో ఉంటాయని చెప్పారు. మండపాల వివరాలు తీసుకున్న అనంతరం డీజీపీ అనురాగ్ శర్మ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలోని భైంసా, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతోపాటు, ఉట్నూర్ ప్రాంతాలు అత్యంత సున్నితమైనవి అయినందున, ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా సమన్వయ కమిటీలను ఏర్పాటుచేసి వాటిద్వారా గొడవలు తలెత్తకుండా అప్రమత్తమవ్వాలని సూచిం చారు. ఆటంకాలు కలుగజేస్తే, ఎంతటివారైనాసరే కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇలాంటి వ్యవహారాల్లో రాజకీయ జోక్యాన్ని కూడా ఖాతరు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు లక్ష్మీనారాయణ, సీతారాములు, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అత్యవసరం

గణేష్ నవరాత్రుల్లో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పోలీసుల విధుల నిర్వహణలో అప్రమత్తమే అత్యవసరమని ఆదిలాబాద్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల అధికారులతో డీపీవో కార్యాలయంలో సమావేశమయ్యారు.

ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల కమిటీలు, ఆయా కాలనీల్లోని పెద్దలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలను తెలుసుకోవాలన్నారు. శాంతి కమిటీ సభ్యులకు కూడా బాధ్యతలు అప్పగిస్తే ఆటంకాలు తలెత్తే సమస్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీలు లక్ష్మీనారాయణ, సీతారాములు, ఉట్నూర్ డీఎస్పీ చంధ్రప్రభు, నిర్మల్ డీఎస్పీ మనోహర్‌రెడ్డి, భె%ంసా డీఎస్పీ అందె రాములు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

విజయభాను

## సంపాదకీయం

# భద్రతారాహిత్యం తగదు

చండీగఢ్‌లో ఐఏఎస్ అధికారి కుమార్తెను బీజేపీ హర్యానా విభాగం అధ్యక్షుడి కుమారుడు, అతడి మిత్రుడు వెంబడించి అపహరణకు ప్రయత్నించడం, అతడి పట్ల పోలీసులు మొదట్లో ఉపేక్ష వహించడం మహిళల భద్రతారాహిత్యానికి అద్దం పడుతున్నది. ఈ నెల నాలుగవ తేదీ శుక్రవారం రాత్రి వర్ణిక కుందు అనే 29 ఏండ్ల యువతి చండీగఢ్‌లోని ఒక ప్రధాన వీధిలో కారు సొంతగా నడుపుకుంటూ తమ ఇంటికి పోతున్నప్పుడు బీజేపీ నేత సుభాష్ బరాలా కుమారుడు వికాస్, ఆయన మిత్రుడు ఆశిష్ ఆమెను తమ కారులో వెంబడించారు. ఆమె కారు ను వేగంగా నడుపుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేసేకొద్దీ, దుండగులు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరం వెంటబడ్డారు. వర్ణిక వెల్లడించిన వివరాల ప్రకారం- వారు అమె కారును అనేక చోట్ల అడ్డుకున్నారు. ఒకచోట తమ కారును అడ్డుపెట్టి ఆపగలిగారు. వారిలో ఒకరు ఆమె కారు దగ్గరకు వచ్చి కారు అద్దాలపై కొట్టడమే కాకుండా, తలుపు తెరవడానికి ప్రయత్నించాడు. వర్ణిక వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తూనే పోలీసులకు సమాచారం అందించడం వల్ల వారు వెంటనే వచ్చి కాపాడారు. పోలీసులు దుండగులు ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తక్షణం స్పందించి ఆమెను కాపాడటం ప్రశంసనీయమే. వారు సమయానికి రాకపోతే తన పరిస్థితి ఎట్లా ఉండేదోనని బాధితురాలు కూడా అంటున్నారు. కానీ దుండగులను పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయిన తరువాత పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, ఆ తరువాత వారు నిర్వహించిన పాత్ర, కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలకు తావిస్తున్నది. దుండగులు ఒక యువతిని వెంటాడటం, కారు తలుపును తెరిచే ప్రయత్నం చేయడాన్ని బట్టి వారి దురుద్దేశం ఏమిటో తెలుస్తూనే ఉన్నది. కానీ పోలీసులు యువతిని వెంబడించారనే సాధారణ కేసు పెట్టి, వారిని అరెస్టు చేసిన కొద్ది గంటలలోనే బెయిల్‌పై విడుదల చేశారు. ఆ తరువాత కూడా ఆమెను అడ్డుకున్నారు అని మాత్రమే చేర్చారు. తనను అపహరించడానికి ప్రయత్నించారని ఆమె వెల్లడించలేదని పోలీసులు సమర్థించుకున్నారు. కానీ వారు తన కారు తలుపు తెరవడానికి ప్రయత్నించారని, తనను అపహరించాలనేది వారి ఉద్దేశమని స్పష్టమని ఆమె తన రాతపూర్వక ఫిర్యాదులోనే పేర్కొన్నారు. దుండగులు వర్ణికను వెంటాడిన రహదారిపై సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు మొదట అన్నారు. ఈలోగా దుండగుల తరపున బాధితురాలికి వ్యతిరేకంగా దుష్ప్రచారం మొదలైంది. బీజేపీ నేత ఒకరు ఆ అమ్మాయి రాత్రి పూట బయటకు ఎందుకు వెళ్ళినట్టు అనే రీతిలో వ్యాఖ్య చేశారు. ఆమె ఫేస్‌బుక్‌లో పెట్టుకున్న మిత్రులతో దిగిన ఫొటోలను తప్పుడు అర్థం వచ్చే రీతిలో వ్యాఖ్యానిస్తూ సోషల్ మీడియాలో ప్రచా రం సాగింది. ఇంతలో నాయకులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పత్రికల్లో, టీవీల్లో ప్రచారమై, ఒత్తిడి రావడంతో పోలీసులు తప్పనిసరై అపహర ణ యత్నం అని చేర్చి నాన్‌బెయిలబుల్ కేసు పెట్టి వారిని అరెస్టు చేశారు. సీసీటీవీ దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి. వాటిలో వర్ణిక కారును దుండగుల కారు వెంటాడుతున్నట్టు స్పష్టంగా ఉన్నది. అయితే ఆమెను అడ్డుకున్న చోట మాత్రం కెమెరాలు పని చేయడం లేదని అంటున్నారు. దుండగులను అరెస్టు చేసినప్పుడు వచ్చిన వైద్యుడు వారి నోటి నుంచి మద్యం సేవించిన వాసన వస్తున్నదని వెల్లడించారు. అయితే రక్త పరీక్ష చేయించు కోవడానికి వారు నిరాకరించారు. వారు మద్యం కొనుక్కున్న దృశ్యాలు కూడా లభ్యమయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనాలను కూడా పోలీసులు సేకరించారు. యువతిపై అఘాయిత్యానికి పాల్పడటం సాధ్యం కాలేదు కానీ, వారికి ఆ ఉద్దేశం ఉన్నదనే ది స్పష్టం. బాధితురాలు ఒక ఉన్నతాధికారి కుమార్తె కనుక ధైర్యంగా నిలబడి న్యాయం కోసం పోరాడుతున్నారు. కానీ బీజేపీ హర్యానా శాఖ అధ్యక్షుడు తన కుమారుడికి అండగా నిలబడినందుకు, పార్టీ ఆయనను తప్పు పట్టడం లేదు.

మొదట్లో పోలీసులు వారికి అనుకూలంగా వ్యవహ రించారు. చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతం అయినందు వల్ల అధికార యంత్రాంగం కేంద్రం అజమాయిషీలో ఉంటుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వమైనా వెంటనే స్పందించి, అనుమా నాలకు తావులేకుండా వ్యవహరించవలసింది. తమది భిన్నమైన పార్టీ అని బీజేపీ నేతలు అధికారంలోకి రాకముందే తరచు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు కొడుకు చేసిన తప్పు కు తండ్రిని తప్పు పట్టడమేమిటని అంటున్నారు. నిజమే కానీ, రాజకీయ నాయకులు ఆదర్శ ప్రవర్తన కలిగి ఉండాలె.

# పతంజలికి పోటీగా ఆధ్యాత్మిక గురు స్టోర్స్



ముంబై : యోగా గురు రాందేవ్ బాబా పతంజలి స్టోర్లపై మరో ఆధ్యాత్మిక గురు పోటీకి వస్తున్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఫౌండర్ శ్రీశ్రీ రవిశంకర్, ఆయుర్వేదిక్ టూత్‌పేస్టులు, సబ్బులు విక్రయించడానికి 1,000 రిటైల్ స్టోర్లను త్వరలోనే ప్రారంభించబోతున్నారు. భారత్‌లో హెర్బల్ ఉత్పత్తులకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రవిశంకర్ కూడా ఆయుర్వేదిక్ ఉత్పత్తుల స్టోర్లను లాంచ్ చేయబోతున్నట్టు తెలిసింది. దేశంలో రెండో అత్యంత ప్రతిష్ఠాతకమైన పౌర సత్కారం పొందిన శ్రీశ్రీ రవిశంకర్, క్లినిక్స్, ట్రీమెంట్‌మెంట్ సెంటర్లను కూడా లాంచ్‌చేయబోతున్నారు. దేశీయ కన్స్యూమర్ ఇండస్ట్రీలో ఆధిపత్య స్థానంలో ఉన్న బహుళ జాతీయ కంపెనీలకు ఇక పతంజలి నుంచి మాత్రమేకాక, శ్రీశ్రీ రిటైల్ స్టోర్ల నుంచి గట్టిపోటీ నెలకొనబోతుంది. ప్రజలు తమ రోజువారీ జీవనంలో ఆయుర్వేద ఉత్పత్తులను ఎక్కువగా వాడుతున్నారని, ప్రస్తుతం మార్కెట్ ప్లేయర్స్ అందిస్తున్న వాటికంటే భిన్నంగా తమ బ్రాండ్ ఉత్పత్తులను ఆఫర్ చేయనున్నట్టు శ్రీశ్రీ ఆయుర్వేద ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ తేజ్ కట్పిటియా చెప్పారు.

''శ్రీశ్రీ తత్వ'' బ్రాండెడ్ స్టోర్లను ప్రారంభించబోతున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే ఈ కంపెనీ మోడరన్ రిటైల్ స్టోర్లు, ఆన్‌లైన్ ద్వారా హెల్త్ డ్రింక్స్, సబ్బులు, సుగంధాలు, సుగంధద్రవ్యాలును 2003 నుంచి విక్రయిస్తోంది. కానీ ప్రస్తుతం పలు ఆహార, గృహ కేటగిరీల్లో 300కు పైగా ఉత్పత్తులతో తమ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తున్నారు. ఈ ఉత్పత్తులను కూడా భారత్‌లో మూడు తయారీ యూనిట్లలో ఇన్-హౌజ్‌గానే ఉత్పత్తిచేస్తున్నారు. మరోవైపు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందూస్తాన్ యూనిలివర్ కూడా ఆయుష్ బ్రాండులో ఆయుర్వేదిక్ పర్సనల్ కేర్ ఉత్పత్తులను రీలాంచ్ చేసింది. డాబర్ కూడా తన తొలి ఆయుర్వేదిక్ జెల్ టూత్‌పేస్ట్‌ను డాబర్ రెడ్ ఫ్రాంచైజ్ కింద ఆవిష్కరించింది.

# భారత సంతతి ఎడిటర్‌పై వేటు



న్యూయార్క్: భారత సంతతికి చెందిన ప్రముఖ జర్నలిస్టు, లాస్‌ఏంజెల్స్ టైమ్స్ ఎడిటర్ దేవన్ మహరాజ్‌పై పత్రిక యాజమాన్యం వేటువేసింది. 28 ఏళ్ల పాటు లాస్‌ఏంజెల్స్ టైమ్స్‌లో పనిచేస్తున్న మహరాజ్ 2016 నుంచి పత్రిక ఎడిటర్, పబ్లిషర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనతో పాటు పలువురు సీనియర్ ఎడిటర్లను కూడా సంస్థ నుంచి తొలగించారు.

ట్రినిడాడ్‌కు చెందిన మహరాజ్ 1989 సమ్మర్ ఇంటర్న్‌గా పత్రికలో తన జర్నలిస్ట్ కెరీర్ ప్రారంభించారు. అనంతరం లాస్‌ఏంజెల్స్, తూర్పు ఆఫ్రికాలో రిపోర్టర్‌గానూ సేవలందించారు. ఆపై అసిస్టెంట్ ఫారెన్ ఎడిటర్, బిజినెస్ ఎడిటర్, మేనేజింగ్ ఎడిటర్ బాధ్యతలను నిర్వర్తించారు.

మహరాజ్ సంపాదకత్వంలో పత్రిక మూడు ప్రతిష్టాత్మక పులిట్జర్ ప్రైజ్‌లను గెలుచుకోవడం గమనార్హం. డిజిటల్ దిశగా మళ్లే క్రమంలో ఖర్చు తగ్గించుకోవడం కోసమే వీరిపై పత్రిక యాజమాన్యం వేటువేసింది.

# మా ఫ్రాంచైజీ పేరు మార్చుకుంటాం..!




న్యూఢిల్లీ: ఫిక్సింగ్ ఆరోపణలతో రెండేళ్ల పాటు నిషేధం ఎదుర్కొని తిరిగి ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో అడుగుపెట్టడానికి సిద్ధంగా ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ పేరును మార్చుకునే యోచనలో ఉంది. ఈ మేరకు పేరు మార్చుకుని బరిలోకి దిగేందుకు అనుమతి ఇవ్వాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ)ని కోరింది. దీనిలో భాగంగా బీసీసీఐకి లేఖ రాసింది. దాంతో పాటు తమ సొంత వేదిక జైపూర్ ను కూడా మార్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని విన్నవించినట్లు సమాచారం

మరొకవైపు కింగ్స్ పంజాబ్ ఎలెవన్ కూడా సొంత వేదిక మొహాలీ నుంచి తరలిపోయేందుకు యత్నాలు చేస్తోంది. ఇండోర్ ను తమ సొంత మైదానంగా మార్చుకునే పనిలో ఉంది. గతంలో మొహాలీ క్రికెట్ అసోసియేషన్ నుంచి కింగ్స్ పంజాబ్ కు ఆశించిన స్థాయిలో సహకారం లభించకపోవడంతో వేదికలో మార్పుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.

# ఎయిర్‌ఏసియా ఆఫర్, టిక్కెట్ ధరెంతంటే..

న్యూఢిల్లీ : మలేషియా బడ్జెట్ ఎయిర్‌లైన్స్ ఎయిర్‌ఏసియా ప్రమోషనల్ స్కీమ్ ప్రారంభించింది. ఈ ప్రమోషనల్ స్కీమ్‌లో పరిమిత కాల వ్యవధిలో ఎంపికచేసిన వన్-వే విమానాలకు టిక్కెట్‌ను రూ.999కే విక్రయించనున్నట్టు పేర్కొంది. ఈ టిక్కెట్ ధరలోనే అన్ని ఛార్జీలు కలిపి ఉంటాయి. ''7 డేస్ ఆఫ్ మ్యాడ్ డీల్స్'' పేరు మీద ఈ ప్రమోషనల్ స్కీమ్‌ను ఎయిర్‌ఏసియా ఆఫర్ చేస్తోంది.

ఈ స్కీమ్ కింద విమాన ప్రయాణికులు అడ్వాన్స్ బుకింగ్స్ చేపట్టాల్సి ఉంటుందని ఎయిర్‌ఏసియా తన వెబ్‌సైట్లో చెప్పింది.

ఈ ఆఫర్ 2018 ఫిబ్రవరి 26 నుంచి 2018 ఆగస్టు 28 వరకు ప్రయాణాలకు అందుబాటులో ఉంటుంది.

వెబ్, ఎయిర్‌ఏసియా మొబైల్ యాప్ ద్వారా 2017 ఆగస్టు 27 వరకు ఈ 7-డే సేల్ కింద బుకింగ్స్ చేపట్టవచ్చు.

''ప్రమోషనల్ స్కీమ్ కింద అందించే సీట్లు పరిమిత సంఖ్యలో ఉన్నాయి. అన్ని విమానాలకు ఈ స్కీమ్ వర్తించదు. కొత్త కొనుగోళ్లకు మాత్రమే ఇది అందుబాటులో ఉంటుంది'' అని ఎయిర్‌ఏసియా తన వెబ్‌సైట్‌లో తెలిపింది.

ఈ ప్రమోషనల్ స్కీమ్ కిందనే భువనేశ్వర్-కోల్‌కత్తా, గోవా-బెంగళూరు, గౌహతి-ఇంఫాల్, హైదరాబాద్-బెంగళూరు, కొచ్చి-బెంగళూరు మార్గాల టిక్కెట్ ధర రూ.1,099గా ఉంది.

## కవి సమయం

# ప్రేమను ప్రేమతో బ్రతికించండి

గెలిచినప్పుడు 'జ్ఞాపకాలు' మిగులుతాయి!
ఓడినప్పుడు 'అనుభవాలు' మిగులుతాయి!
కాని, గెలుస్తామో, ఓడుతామో తెలియని,
'ప్రేమలో' పడితే కన్నీళ్ళే మిగులుతాయి!
తెలియని బంధం, తెలివిగా చుట్టుకుంటుంది!
అందాన్నిఆరాదించాలేగాని, అనుభవించడానికి చూడకూడదు!
ఆడదాని మనసు అరిటాకువంటిది!
'ప్రేమ' మనస్సులో ఒక్కసారే పుడుతుంది!
'ప్రేమ' ప్రేమను గెలిపిస్తుందంటారు!
నిస్వార్థమైన ప్రేమలు నిలువుటద్దాలకు సాక్ష్యాలు!
మగవాళ్ళ ప్రేమలో స్వార్థము ఉంటుంది!
ఆడదాని ప్రేమ స్వార్ధరహితంగా ఉంటుంది!
అందుకే ప్రేమ సాగరములో మునిగే,
యువతీ యువకుల్లారా!
మిమ్మల్ని మీరు 'ప్రేమ' ముసుగుల్లో మునిగిపోకుండా,
'ప్రేమ'ను 'ప్రేమతో' బ్రతికించండి!

రచయిత : వేగి నూకరాజు

# పంచాంగం

మాసం : భాద్రపద; తిథి: విదియ రా.9.58; పుబ్బ మ.3.54; రా.వ.11.08ల 12.44.

బుధవారం 23-08-2017

**మేషం** : బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. ఎదుటి వారితో సంభాషించేటపుడు మెలకువ వహించండి. రాజకీయనాయకుల కదలికలపై విద్రోహులు కన్నేసిన విషయం గమనించండి.

**వృషభం** : విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమదాయకం. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి.

**మిథునం** : మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచి కేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెలకొంటుంది.

**కర్కాటకం** : దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

**సింహం** : విద్యార్థులకు ఏకాగ్రత వల్ల అభివృద్ధి పొందగలుగుతారు. కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘం లోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**కన్య** : స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు

**తుల** : కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంతమవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరులకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి. దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

**ధనుస్సు** : ప్రేమికులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి. కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. గృహంలో మార్పులు, చేర్పులకై చేయు యత్నాలు ఫలిస్తాయి.

**మకరం** : ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం. చిరు వ్యాపారులకు చికాకులు తప్పవు. బంధువుల రాకపోకలు అధికమవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు.


**కుంభం** : స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్యలెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు.

**మీనం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు.

# కష్టాలను తీర్చే శ్రీ జగదాంబ మాత

## సంకీర్తన





మహారాష్ట్రలోని అత్యంత ప్రసిద్ధి గాంచిన ఒక పుణ్య స్థలాన్ని మీకు పరిచయం చేస్తున్నాం. మహారాష్ట్రలో ఉన్న ముఖ్యమైన పట్టణాల్లో ఒకటైన అహ్మద్‌నగర్‌కు సమీపంలోని మొహాదే అనే ప్రాంతం ఉంది. ఇక్కడ శ్రీ జగదాంబ మాతా ఆలయం ఉంది.

ఈ మాతను దర్శించు కునే భక్తులకు కోరిన కోర్కెలు, కష్టాలు తీరుతాయని బలమైన విశ్వాసం.

ఈ ఆలయం ఇక్కడ వెలిసేందుకు ఒక భక్తుడే ప్రధాన కారణం. అతని పేరే.. బన్సీ దహిఫలే. శక్తిపీఠాల్లో ఒకటైన మాహూర్ఘర్ అనే ప్రాంతంలో వెలసిన రేణుకా మాతకు తీవ్ర భక్తుడు. ప్రతిసారి అక్కడకు వెళ్లే భక్తుడు తమ గ్రామానికి వచ్చి వెలియాల్సిందిగా ప్రార్థించేవాడు.

ఆయన కోర్కె ప్రకారం ఒక రోజు దహిఫలే కలలోకి వచ్చిన రేణుకా మాత.. ఆ గ్రామంలోని కొండ శిఖరంపై వెలసివున్నట్టు చెప్పింది. అప్పటి నుంచి భక్తుడు అక్కడకు వెళ్లి పూజలు చేసి, ప్రార్థినలు చేయసాగాడు. రేణుక మాత మరో రూపమే శ్రీ జగదాంబ మాత పేరుగాంచింది. గురు రిషేదర్, గురు మచేంద్రనాథ్, కానిఫ్ నాథ్, కాహినాథ్, జాలింగర్ నాథ్ నాగనాథ్ అనే ప్రముఖులు ఈ ఆలయానికి వచ్చి నాతను దర్శించుకున్నారు. ఆశ్వని నక్షత్రం, ఏకాదశి రోజున శ్రీ జగదాంబ మాతకు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆలయంలో లిఖించిన శిలాఫలకాలపై శ్రీజగదాంబ మాత తన శక్తిపీఠం వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది.

ఈ ఆలయానికి సమీపంలో శివాలయం ఉంది.

దీనికి ఆనుకుని ఉన్న కోనేరులో పుణ్యస్నానం చేసిన తర్వాతే శ్రీ జగదాంబ మాతను దర్శనం చేసుకుమని భక్తులు చెపుతుంటారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# చాలీచాలని బస్సులతో విద్యార్థుల అవస్థలు



కూరుకున్న బస్సుల్లోనే వెళ్తున్న విద్యార్థులు

రావికమతం : ఆర్టీసి యాజమాన్యం చాలీచాలని బస్సులను వేయడంతో విద్యార్థులు ప్రమాదకర ప్రయాణాలు చేస్తున్నారు. నర్సీపట్నంలో వివిధ కళాశాలలో, పాఠశాలల్లో, రావికమతం, మేడివాడ, టి.అర్జాపురం, దొండ పూడి, కొత్తకోట, రోలుగుంట తదితర ప్రాంతాల నుండి వందలాది మంది విద్యార్థులు నర్సీపట్నంలో విద్యనభ్యసిస్తుంటారు. వారు ఉదయం వచ్చినప్పుడు, సాయంత్రం వెళ్లేటప్పుడు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తుంది. పాఠ శాలలు, కళాశాలల వేళలను దృష్టిలో పెట్టుకొని ఆయా టైములో నర్సీపట్నం ఆర్టీసి యాజ మాన్యం బస్సులు వేయక పోవడంతో విద్యార్థులు తమ ఇళ్లకు చేరుకునేదుకు ఫుట్ పోర్టులపై వేలాడుతూ ప్రమాద కరంగా ప్రయాణి స్తున్నారు. ఏ మాత్రం కాలు జారినా, చేయి జారినా అంతే సంగతలు. విద్యార్థులకు పాసులు అయితే ఇస్తున్నారు కానీ అవసరమైన బస్సులను సమయానికి తిప్పడం లేదు. మరీ ముఖ్యంగా ఉదయం టైములో చాలా దారుణంగా పరిస్థితులు ఉన్నాయి.

ఉదయం 7.10, 7.45, 8.10 టైములో ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఇప్పటికైనా ఆర్టీసి అధికారులు స్పందించి విద్యార్థులకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

# పెద్దచెరువులో పడి వ్యక్తి మృతి



నాగేశ్వరరావు మృతదేహం

నర్సీపట్నం : పెద్ద చెరువులో ఒక వ్యక్తి పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే నర్సీపట్నం బిసి కాలనీకి చెందిన ప్రదక్షణ నాగేశ్వరరావు(50) స్థానికంగా బట్టల షాపులో పని చేస్తుంటారు. ఈయన మృతదేహం పెద్ద చెరువు వద్ద కనిపించింది. ఈయన గత 15 రోజులుగా పని మానేసి మద్యం తాగుతూ తిరుగుతుండేవాడని, మద్యం మత్తులో పడి పోయి ఉండ వచ్చునని చెబుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని నర్సీపట్నం టౌన్ సిఐ సింహాద్రినాయుడు తెలిపారు.

# దేశపాత్రునిపాలెంలో సిట్ బృందం పర్యటన



పరవాడ: దేశపాత్రునిపాలెంలో మంగళవారం సిట్ బృందం పర్యటించారు. అనంతరము సిట్ బృందం ఎసిపి రంగరాజు విలేఖర్లతో మాట్లాడుతూ గతంలో మాజీ సైనికులకు తొమ్మిది సర్వే నెంబర్లులో పదిహేడుమందికి సుమారు నలభైరెండు నుండి యాభై ఎకరాలుకు ఎన్.ఒ.సి.లు ఇచ్చింది. ఆ ఎన్ఒసిలు సరిగ్గా ఉన్నయా లేవా వాటిపై సమగ్ర విచారణ చేసి నివేదికను అధికార్లుకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అయనతో పాటు సిఐ బి.తిరుమలరావు, తహశీల్ధార్ గోపాలకృష్ణ, సర్వే యర్లు, పరవాడ తహశీల్దార్ మల్లేశ్వరావు, విఆర్ఒలు సన్యాశి రాజు, తులసి, భిభూషణ్ పాల్గొన్నారు.

# యువత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలి

## సెట్విస్ సిఇఒ అట్టాడ సిరి



యువజనోత్సవాల్లో సెట్విస్ సిఇఒ సిరి

నర్సీపట్నం : యువత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరేందుకు ఆసక్తి చూపాలని సెట్విస్ సిఇఒ అట్లాడ సిరి అన్నారు.. మంగళవారం నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన డివిజన్ స్థాయి యువజనోత్సవాలు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ యువత మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. దేశానికి యువతే కీలకమన్నారు. 15-29 మధ్య యువతీయువకులకే యువనోత్సవాల్లో విపత్తులు ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్‌తో కలిసి ఇంటర్ డిస్ట్రిక్ యూత్ ఇన్‌చార్జి కర్నూలు, చిత్తూరు యువతీయువకులతో పర్యటన చేస్తారన్నారు. మన పిల్లల్ని కూడా ఇతర జిల్లా పంపుతామన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గనాలన్నారు. అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమాలు చేయిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ, ఉద్యోగాలకే ఆసక్తి చూపడం లేదన్నారు. ఎయిర్‌పోర్సు, ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తరగతి పాసైన ఉద్యోగాలు ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 1న నర్సీపట్నంలో సెలక్షన్లు జరుగుతాయన్నారు. అనంతరం నర్సీపట్నం ఎస్సీ బాలికల గురుకుల కళాశాల నుండి శాస్త్రీయ నృత్యం, శాస్త్రీయ సంగీతం, సాంస్కృతిక అంశాలతో ప్రదర్శన ఇచ్చారు. వీరు హాస్టల్ విద్యార్థులు వస్త్రధారణ విషయంలో మార్కులు తగ్గాయి. నైపుణ్యం ప్రదర్శన విషయంలో మంచి ప్రతిభ కనబర్చారని సిరి కొనియాయారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరావు, వేములపూడి కళాశాల ప్రిన్సిపాల్ చిన్నారావు, మాకవరపాలెం నుంచి వాసుదేవరావు, కేడిపేట నుంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె



స్టేట్‌బ్యాంక్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

నర్సీపట్నం : సోమవారం బ్యాంకు ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనం చేపట్టవద్దని, జిఎస్టీ పేరిట సేవల సెంపు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తు బ్యాంకు పాలక మండలాల్లో డైరెక్టర్ల ఖాళీల భర్తీ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కారుణ్య నియామకాలు చేపట్టడం తదితర 17 డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేట్ సంస్థల మొండిబకాయిలతో బ్యాం కుల మనుగడ ప్రమాదం పొంచి ఉంద న్నారు.

కావున వెంటనే కేంద్ర మంత్రివర్గం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హాస్టల్ విద్యార్థులకు మరింత సౌకర్యాలు

## ఏఎస్‌డబ్ల్యూఒ సత్యానారాయణ

నర్సీపట్నం :హాస్టల్ విద్యార్థులకు సౌకర్యాలు మరింత మెరుగుపర్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు నర్సీపట్నం సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి (ఏఎస్‌డబ్ల్యూఒ) తెరపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం హాస్టళ్లకు సంబంధించి విద్యార్థినీ విద్యార్థులకు డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ పెన్సిళ్లు, వాటర్‌బాటిళ్లు, రబ్బర్లు, పెన్నిళ్లు, మండర్‌లు, కార్పట్లు(జంబుకన)లు పంపిణీ చేసినట్లు తెలిపారు. నూతనంగా ఎల్ఇడి బల్బులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. భోజన సమయంలోనూ, చదువుకుంటున్న సమయంలో ఇవి ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు.

పాఠశాలల కంటే ముందుగానే విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి రమణమూర్తి పుస్తకాలను, ఇతర వస్తువులను హాస్టల్ విద్యార్థులకు అందుబాటులో తెచ్చారన్నారు. మరెన్ని సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

కళాశాల హాస్టల్ విద్యార్థులకు కూడా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

# వినాయకచవితి పందిర్లకు అనుమతి తప్పనిసరి

## అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే జైలు తప్పదు
### ఎస్ .ఐ. వెంకటరావు



పరవాడ: పరవాడ మండలములో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా వినాయకుని పందిర్లు వేయటానికి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని పరవాడ ఎస్ఐ వెంకటరావు అన్నారు. మంగళవారం పరవాడ పోలీసుస్టేషన్లులో ఎర్పాటు చేసిన విలేఖర్లు సమావేశంలో అయన మాట్లడుతూ వినాయకుని చవితి ఉత్సవాలునిర్వహించే నిర్వహకులు తప్పని సరిగా అనుమతితీసుకోవాలిని, మందుగుండుకాల్చరాదని, లాఅండ్ అర్డర్‌కూ ఎటువంటి భంగం కలిగించకూడదని అన్నారు. హద్దు మీరి ప్రవర్తిస్తే ఎంతటి వారికైన చట్టారీత్యా చర్యలు తప్పవని అన్నారు. వినాయకుని అనుపూత్సవములో భాగంగా ఎవరైన అసాంఘిక కార్యకలపాలుగాని, అశ్లీల నృతాలు గాని వేస్తే జైలు తప్పదని హెచ్చరించారు.

# మట్టి వినాయకుడుతో పూజలు

## మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మన విశాఖ ప్రజలు మట్టి వినాయక ప్రతిమలనే వినాయకచవితి పూజకు వినియోగించాలని రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. వే ఫౌండేషన్ తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం ఎంవీపీ కాలనీ కార్యాలయంలో పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వలన బీచ్ పర్యావరణం పాడవుతుందని దీనిని గుర్తించి ఇకో ఫ్రెండ్లీ గణేష్ ప్రతిమలు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంటా స్వామి, కార్యవర్గం పొట్నూరు రాజు, జి.రఘు, జి.హష్మిత, బొమ్మి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలి

నర్సీపట్నం : అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని కసిరెడ్డిపాలెం అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి కోరారు. వార్డుమెంబరు, పెద్దలను పిలిపించి ప్రభుత్వఆదేశాల మేరకు అన్నప్రసనరణ, సీమంతాలు జరిపించారు. గ్రామంలో ఉన్న వారు కూడా ఉత్సాహంగా పాల్గని కూటవేటు దూరంలోని ఐసిడిఎస్ ఏసిడిపిఒ జివి.రమణి, సదరు సెక్టారు సూపర్‌వైజర్ పుష్పలత అందుబాటులో ఉన్నప్పటికీ సదరు కార్యక్రమంపై హాజరు కాకపోవడంపై కసిరెడ్డిపాలెం గ్రామస్థులు అసహనంవ్యక్తం చేశారు.

## నదుల సంరక్షణ ఉద్యమానికి
# మద్దతు పలకండి : జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్

### 8000980009కు మిస్డ్ కాల్ ఇవ్వండి





విజయనగరం : దేశంలోని నదులను కాపాడటానికి చేపట్టిన నదుల సంరక్షణ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకవలసి వుందని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ అన్నారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో చేపట్టిన నదుల సంరక్షణ ఉద్యమం పోస్టర్‌ను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సద్గురు జగ్గీ వాసుదేవ్ నేతృత్వంలో చేపట్టిన ఈ ఉద్యమం ద్వారా ప్రజల్లో నదుల సంరక్షణపై అవగాహన ఏర్పడుతుందన్నారు. 2030 నాటికి మన అవసరాలకు కావలసిన నీటిలో 50శాతం మాత్రమే లభ్యమవుతుందని, ఇప్పటి నుండి మేలు కోనట్లయితే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. దేశానికి నదులే జీవనాడులని పేర్కొంటూ ప్రస్తుతం యీ నదులన్నీ ప్రమాదకర స్థితిలో ఉన్నాయన్నారు. కొన్ని వేల సంవత్స రాలుగా ఉన్న నదులు ఒక్క తరంలోనే అంతరించబోతున్నాయని, దేశంలో 25శాతం ప్రాంతం ఎడారిగా మారబోతుందన్నారు. ఇప్పటికే గోదావరిలో 20శాతం, కృష్ణా, నర్మద 60శాతం, కావేరిలో 40శాతం నీటి లభ్యత తగ్గిందన్నారు. జీవనదుల వల్లే భారతదేశం సౌభాగ్యవంతంగా ఉండేదని, కొన్ని వేల సంవత్సరాల పాటు నదులు మనల్ని పోషించాయని, ఇప్పుడు మన నదులను కాపాడుకొనే అవకాశం మన చేతుల్లోనే ఉందన్నారు. నదుల సంరక్షణ ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు 8000980009 మొబైల్ నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ప్రతి ఒక్కరూ దీనికి మద్దతు పలకవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డా.తాడ్డి జస్వంత్ నాయుడు పాల్గొన్నారు.

## ఈనెల 28న
# కలెక్టరేట్ వద్ద ఆదివాసీల ధర్నా

ఒంగోలు : గిరిజనులు, ఆదివాసీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 28వతేదీ కలెక్టరేట్ వద్ద ఆదివాసీ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడావతు విష్ణునాయక్ తెలిపారు. సోమవారం అందుకు సంబంధించిన ప్రచార పత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు, ఆదివాసీలు, విద్యార్థులంతా ధర్నాలో పాల్గొని రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు యత్నించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు బాలాజీ నాయక్, ఇట్టా గురప్రసాద్, మాల్యాద్రి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## హరిత శోభితం కానున్న విమానాశ్రయం

కడప : కడప విమానాశ్రయం హరిత శోభితం కానుంది. పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా మారనుంది. రూ.1.35 కోట్లతో వివిధ రకాలకు చెందిన 7500 పండ్ల మొక్కలను నాటి అభివృద్ధి చేసేందుకు నివేదిక తయారు చేసి అనుమతి కోసం డ్వామా పీడీ, జిల్లా కలెక్టరుకు పంపామని వల్లూరు ఎంపీడీవో సాంబశివారెడ్డి తెలిపారు. విమానాశ్రయంలో సంబంధిత అధికారి పి.శివప్రసాద్‌తో సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ఉపాధి హామీ పథకంలో మొక్కలను నాటి ఐదేళ్లు వాటి సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు రూ.1.35 కోట్లతో నివేదికను సిద్ధం చేశామని చెప్పారు.

# అనాధలకు చేయూత నివ్వడంలో యువత ముందుండాలి

## -కుందేటి బ్రదర్స్

గాజువాక: ఆనాధులను అన్నివిధాలుగా ఆదుకోవాలని, అందుకు యువత ముందుండాలని ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ కుందేటి బ్రదర్స్ అధినేత కుందేటి బాబురావు పిలుపు నిచ్చారు. కుందేటి బాబురావు అల్లుడు కందివెంకటరాజు దంపతుల కుమార్తె తన్వీ మొదటి రోజు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం శ్రీనగర్ అఫీషియల్ కాలనీలోని డిజైర్ సొసైటీలోని 34మంది హెచ్ఐవి బాధిత, అనాధ పిల్లలకు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి చిన్నారి తన్వీకి దీవెనలను అందించారు.

ఈ సందర్భంగా కుందేటి బ్రదర్స్ అధినేత కుందేటి బాబురావు మాట్లాడుతూ మనిషి స్వార్థం విడనాడాలని, సంపాదనలో ఎంతోకొంత సమాజ సేవా కార్యక్రమాలకోసం వినియోగించాలని, తద్వారా సమాజంలో మంచి గుర్తింపు పొందాలని కోరారు. సమాజంలో ఎంతో మంది అనాధులుగా జీవిస్తున్నారని వారిని ఆదుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని అన్నారు. ఎదో ఒక సందర్భంలో, ఎంతో కొంత సమాజ సేవకు వెచ్చించాలని కోరారు. దీనిలో యువత భాగస్వామ్యం కావాలని, బావితరాలకు సమాజసేవలపై మక్కువ పెరిగే విధంగా కృషి చేయాలని కోరారు.

అనంతరం పిల్లలకు స్టీల్ బాక్స్‌లు పంపిణీ చేసారు. అంతే కాకుండా ముగ్గురు పిల్లలకు చదువుకు అవసరమగు ఫీజు రూ.12వేల రుపాయలను డిజైర్ సంస్థ కు ఇచ్చారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం వలన డిజైర్ సొసైటీ కి ఎంతో ఉపయోగకరమని, అందుకు ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలని డిజైర్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుందేటి కుటుంబ సభ్యులు మంగతాయారు, కందిదేవి, కుందేటివాసు, కళ్యాణి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

**IN THE HON'BLE COURT OF THE PRL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**

**E.P.3/2012 IN O.S.312/1999**

**Between:**
**Vastvayi Satyavathi ...Decree Holder**
**And**
**Vommi Sai Ramani ...Judgement Debtor**

**U/OR 21 Rule 52 CPC Notice to JDr**

**To,**
**JDR:**
**Vommi Sai Ramani, W/o.late Subba rao,**
**R/o.D.No.10-8-550, Kaniti Road,**
**Old Municipal Office, New Gajuwaka,**
**Visakhapatnam District.**

Please take notice that the above named Decree Holder has filed above numbered Execution petition against you for the Recovery of the decree amount and the Hon'ble court was pleased to ordered to serve notice to you through publication, and thus you are hereby directed to appear in the above court in person or by a pleader duly instructed, to submit objections having if any, for allowing the petition as prayed for on **08-09-2017 at 10.30 Am.**

Take notice that in default of your appearance in that day and hour before mentioned, the petition will be heard in your absence and determined according to law.

Published as per orders of the Court.

**T.RAVI KUMAR**
**Advocate for the Petitioner**
**Krishnakuteer Apts, 9-21-7;F-12;**
**Opp."B" Gate, Timpany School,**
**C.B.M.Compound,**
**Visakhapatnam.**

# చంద్రబాబు పాలన పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

## - కాపులను వంచించిన బాబు - నిరుద్యోగులకు టోకరా

## - ప్యాకేజీల కోసం ఆరాటం

### వైకాపా ఎంఎల్‌సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

కాకినాడ : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం, సిఎం చంద్రబాబు పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారనీ,వైకాపా సీనియర్ నాయకులు, ఎంఎల్‌సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కార్యాలయం పద్మనాభ ఫంక్షన్‌హాలులో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. రైతు, డ్వాక్రా రుణమాఫీలు పూర్తిగా అమలు చేయలేదన్నారు. రూ.87,612 కోట్ల రైతు రుణమాఫీగానూ కేవలం రూ.11,000 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమచేసారని, ఆ మొత్తం రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీ, చక్రవడ్డీలకే సరిపోయిందన్నారు. రైతురుణాలు మాత్రం అలాగే మిగిలిపోయాయన్నారు. అలాగే డ్వాక్రా రుణాలు రూ.14,300 కోట్లు మాఫీ చేయవలసి ఉండగా కేవలం రూ.3000 కోట్లు మాఫీ చేయడం జరిగిందన్నారు. వడ్డీ మొత్తం మహిళలు వినియోగించుకోలేకుండా పోయిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగం, నిరుద్యో భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు వారిని కూడా మోసం చేసారన్నారు. రెండు సార్లు ప్రత్యేకహోదాపై తీర్మానం చేసినా హోదాను మాత్రం సాధించలేకపోయారన్నారు. కేంద్రంతో చంద్రబాబునాయుడు రాజీపడ్డారన్నారు. 11 రాష్ట్రాల్లో ప్రత్యేక హోదా అమలవుతుండగా వాటిని మరో 10 ఏళ్లు పెంచిన కేంద్రం రాష్ట్రానికి మాత్రం ఎందుకు ఇవ్వడం లేదని చంద్రబాబు ప్రశ్నించడం లేదన్నారు. ప్రభుత్వంలో అవినీతి, మాఫియాలు మితిమీరిందన్నారు. గోదావరి పుష్కరాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే 29మంది ప్రాణాలు కోల్పోయారన్నారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సీ ఉమ్మారెడ్డి

గోదావరి ప్రజలు చంద్రబాబుపట్ల ఆగ్రహంగా ఉన్నారన్నారు. నంద్యాల, కాకినాడ ఎన్నికలలో ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. కాపు సామాజిక వర్గ రిజర్వేషన్లపై ముద్రగడను తీవ్రంగా అవమానిస్తున్నారన్నారు.

స్థానిక సంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో రూ.4వేలకోట్ల కేంద్రం నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం కష్టంలో ఉన్నా రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులురాలు లక్ష్మీ పార్వతీ, ఎంఎల్‌ఏ గిడ్డి ఈశ్వరీ, కర్రి పాపారాయుడు, కొప్పన మోహనరావు, సిహెచ్ వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

# సత్యసాయి మందిరంలో ఘనంగా వేద సభ



శాస్త్రోక్తముగా వేద పారాయణం నిర్వహిస్తున్న క్రమాపాఠీలు

రావులపాలెం : రావులపాలెంలో శ్రీ సత్యసాయి సేవా కేంద్రం నందు శ్రీ పార్వతీ రామలింగేశ్వర వేద శాస్త్ర విద్వన్‌మహా సభ ఆధ్వర్యంలో 24 వ వార్షిత్సవం సందర్భముగా వేదపారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ వేద పారాయణ సభలో మడికి సూర్య సుబ్రహ్మణ్య ఘనాపాఠి, శ్రీపాద మాణిక్య ఘనాపాఠిలు అధ్యక్షత వహించగా 9 మంది ఘనాపాఠీలు, 22 మంది కృష్ణ యజుర్వేద క్రమాపాఠీలు, 15 మంది శుక్ల యజుర్వేద క్రమాపాఠీలు, సామవేద పండితులు ఒకరు, ముగ్గురు అధర్వణ వేద పండితులు, 52 మంది స్మార్తలు పాల్గొని లోక కళ్యాణార్థం చతుర్వేదములు పారాయణం చేసారు. ఈ కార్యక్రమంలో మన్యం పర్వత వర్ధనరావు, మన్యం భాస్కరరావు, దేవరభొట్ల రాధాకృష్ణ, కర్రి సత్తిరెడ్డి, యోగాచార్య కర్రి సత్తిరెడ్డి, కొవ్వూరి సీతారెడ్డి, మల్లిడి వెంకటరెడ్డి, పెన్మెత్స రామరాజు, గోటేటి మార్కండేయులు, సుమారు 100 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# కార్పోరేషన్ ఋణాలు మంజూరు లబ్ధిదారుల ఎంపిక

ఆలమూరు :- స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద జాస్తి వారి కళ్యాణమండపంలో మంగళవారం ఎస్.సి., ఎస్.టి., బి.సి. కాపు కార్పోరేషన్ల ద్వారా రాయితీపై ఋణాలు మంజూరుకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఆలమూరు ఆంధ్రాబ్యాంకు ద్వారా ఈ ఋణాలు ఇచ్చేందుకు మూలస్థానం, జొన్నాడ, కలవచర్ల, ఆలమూరు గ్రామానికి చెందిన వారికి ఎంపిడిఓ నాతి బుజ్జి ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొత్తపల్లి ధనలక్ష్మి కాశీవిశ్వనాధ్, జెడ్‌పిటిసి దండంగి మమత రామారావు, ఈఓపిఆర్‌డి పి.బొజ్జిరాజు, ఆలమూరు,పినపళ్ల, జొన్నాడ సర్పంచ్‌లు గంధం బంగారుబాబు, కొత్తూరి వీరన్ననాయుడు, చాపల రూతియ్య, ఎంపిటిసిలు అనుసూరి నాగరత్నం, ఇనపకోళ్ళ శ్రీనివాస్, సెలక్షన్ కమిటీ సభ్యులు సిద్దిరెడ్డి పెద్దకాపు, వంటిపల్లి సతీష్, రాయుడు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం మార్పు :-** మండల పరిధి పెదపళ్ళ బరోడా బ్యాంకు పరిధిలో 24 గురువారం జరిగే లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం 23 బుధవారంనకు మార్చినట్లు ఎంపిడిఓ నాతి బుజ్జి తెలిపారు. మండల పరిధి పెదపళ్లలోని సత్యనారాయణరావు కళ్యాణ మండపంలో జరుగు లబ్దిదారుల ఎంపిక కార్యక్రమంలో సంధిపూడి, పెదపళ్ల, పినపళ్ల, చింతలూరు, సూర్యారావుపేట, కలవచర్ల గ్రామాలకు చెందిన వారికి ఈ ఇంటర్వ్యూలు జరుగునని, దరఖాస్తుదారులు ఈమార్పుని గమనించవలసినదిగా ఆమె తెలిపారు.

# బ్రహ్మణులంతా చంద్రబాబు వెంటే

### ఆనంద సూర్య

కాకినాడ : రాష్ట్రంలోనిబ్రహ్మణులంతా సిఎం చంద్రబాబు వెంటే ఉన్నారని బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య వెల్లడించారు. మంగళవారం కాకినాడలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోని పాత్రికేయులతో మాట్లాడుతూ బ్రహ్మణ సంక్షేమం కోసం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్రహ్మణుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్నారన్నారు. రూ.45 కోట్ల మేర బ్రహ్మణ విద్యార్థుల విద్యోన్నతి కోసం ఖర్చు చేసారని తెలిపారు. అల్పాదాయ వర్గాలైన బ్రహ్మణ కుటుంబాలు, ఈ చర్యలతో సంతోషదాయకంగా ఉన్నాయన్నారు. కార్పొరేషన్ ద్వారా 14 సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్నారన్నారు. కాకినాడ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రూ.2.80 కోట్ల మేర బ్రహ్మణులకు లబ్ధి చేకూరిందన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చంద్రబాబు విజయవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. వైకాపా బాపట్ల ఎంఎల్‌ఏ కోన రఘుపతి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారన్నారు. దేవాలయాల్లో అర్చకుల వేతనాలలో కోత విధించడం లేదన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌గా ఐవైఆర్ కృష్ణారావు సమర్థవంతంగా పని చేయలేకపోయారని విమర్శించారు. బ్రహ్మణ కార్పొరేషన్ అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

డొక్కా నాథ్‌బాబు మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలలో 20వేల మంది టిడీపీకే ఓటు వేస్తారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్రహ్మణ నాయకులు పాల్గొన్నారు.

# బియంపి,ఆర్ యంపి,పియంపి ల గుర్తింపు పట్ల హర్షము వ్యక్తం చేసిన పదిలం

అన్నవరం : రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న బియంపి,ఆర్ యంపి,పియంపి తరహ గ్రామీణ వైద్యులు పట్టణములలో మురికివాడలలో గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న ఈ తరహ వైద్యులకు ప్రభుత్వం నుండి ఎటువంటి గుర్తింపు లేక గత 40 సంవత్సరము నుండి పోరాటము చేయగా చేయగా నేటి తెలుగుదేశం ప్రభుత్వంలో మన ముఖ్యమంత్రి వర్యులు నారా.చంద్రబాబు నాయుడు మరియు ఆరోగ్యశాఖా మంత్రి డా.కామినేని.శ్రీనివారావు గారు మమ్ములను గుర్తించి ఒక చట్టబద్ధమైన హక్కు కల్పించి అందులో భాగంగా ప్రతీ గ్రామీణ వైద్యునికి పారామెడికల్ ట్రైనింగ్ ఇచ్చి ఒక పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణత పొందిన సభ్యునకు ఒక రిజిస్ట్రేషన్ నెంబరుతో సర్టిఫికేట్ జారీచేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గార్కి,మంత్రి కామినేని.శ్రీనివాస్ గార్కి,అదేవిధంగా మాకు వెన్నంటి ఉండి నడిపించిన టి.జనార్ధన్ , రాయపాటి.శ్రీనివాస్ రావు మా గ్రామీణ వైద్యుల తరుపున ప్రత్యేక అభినందనలు తెలియపరుస్తున్నాము.అదేవిధంగా మాకు గుర్తింపు కొరకు ఇంతటి శ్రమ ఓడ్చి కష్టపడిన రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు రాజాసిద్దార్థ,సెక్రటరీ కరెళ్ళ.గణపతి రావు,ఆర్గనైజేషన్ సెక్రటరీ అచ్చిరెడ్డి,ట్రైజరర్ జె.ప్రసాద్, ఉపాధ్యక్షులు వివి కృష్ణారావు,నండూరి.ఉమాశంకర్, ఆకాశం.గౌరీష్ బాబు,లంక.సత్యనారాయణ, కంబాల.బాబూరావు, మహమ్మద్ రఫీ,జంగం.జ్యోషి, గోపాల్, చిరంజీవి, సత్తార్.రాజశేఖర్ మొదలైన పెద్దలందరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు మరియు ఫెడరేషన్ రాష్ట్ర సంఘ ప్రచార సహాయ కార్యదర్శి పదిలం. బెన్నబాబు.

# ఓటుతో సత్తా చాటండి

కాకినాడ : నిజాయితీగా తమకు సేవలందించగలిగే వ్యక్తినే నగరపాలక ఎన్నికల్లో గెలిపించాలని, ఓటును నమ్ముకోండి ఓటును అమ్ముకోవద్దని ఫోరమ్ ఫర్ ఆర్ టి ఐ జాతీయ కన్వీనర్ చేతన పిలుపునిచ్చారు. కాకినాడ లో జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 32వ డివిజన్ నందు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.డి వల్లీ భాషాకు మద్దతుగా రామకృష్ణారావు పేటలో జరిగిన ప్రచార సభల్లో చేతన పాల్గొని ప్రసంగించారు. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్, జర్నలిస్ట్ భాషాను గెలిపించాలని, ఓటును నోటుకు బలి చేయకుండా ఉన్నత విద్య కలిగిన విద్యావంతుడైన భాషాను విజిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని చేతన అభ్యర్థించారు. తనకు అవకాశం కల్పిస్తే సమస్యలను పరిష్కరించి ప్రజలు ఎప్పుడు పిలిస్తే అపుడు పలికి వారికి ఉత్తమ సేవకుడిగా ఉంటానని భాషా అన్నారు. ఇంకా భాషకు మద్దతుగా అనేకమంది జర్నలిస్టులు డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని భాషా గెలుపుకై ప్రచారం నిర్వహించారు.

# వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో వున్న కంది విత్తనాలు

ఆలమూరు :- వరి పొలాల గట్లుపై నాటుకునేందుకు కంది విత్తనాలు స్థానిక వ్యవసాయశాఖాధి కారి కార్యాలయంలో అందుబాటులో వున్నట్లు మండల వ్యవసాయా శాఖాధికారి కె.వి.ఎన్.రమేష్ కుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ అధికారి వారి కార్యాలయంలో మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ వరిపంటకు వ్యాపించే పలు తెగుళ్లు నివారణకు పలు సూచనలిచ్చారు. వరిపొలాల్లో హిస్టా (తాటాకు పురుగు) ఎక్కువగా వున్న యెడల మోనోక్రోటోఫాస్ 2.2 మి.లీ., క్లోరిఫైరిఫాస్ 2 మి.లీ. ప్రొపినోఫాల్ 2 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. కాండం తొలుచు పురుగు నివారణకు గాను క్లోరోఫైరిఫాస్ 2 మి.లీ., కార్బోఫైహైడ్రోక్లోరైడ్ 2 గ్రా., ఎసిఫేట్ 1.5 గ్రా., కార్బోఫ్యూరాన్-36 గుళికలు ఎకరానికి 12 కేజీలు, కార్ఫాస్ హైడ్రోక్లోరైడ్-4జి గుళికలు ఎకరానికి 6 కేజీలు వాడాలని ఆయన వివరించారు.

# ఎరువుల దుకాణాల్లో ఈపాస్ యంత్రాలు తప్పనిసరి



రావులపాలెం : కేంద్ర ప్రభుత్వం ఎరువుల శాఖ ద్వారా రైతులకిస్తున్న సబ్సిడీ ప్రత్యక్ష నగదు బదిలీద్వారానే రిటైల్ ఎరువుల డీలర్లు రైతులకు అందజేయాలని మంగళవారం మండల వ్యవసాయాధికారి భార్గవ మహేష్ తెలిపారు. అందుకోసం ప్రతి ఎరువుల డీలరు విధిగా ఈపోస్ యంత్రాలను వినియోగించి ఎరువులను సబ్సిడీపై రైతులకు అందించాలని ఆయన సూచించారు.

ఈ విదానం ద్వారా రైతుకు అందవలసిన సబ్సిడీ దుర్వినియోగం కాకుండా ఉంటుందన్నారు. మండలంలో 28 ఎరువుల రిటైల్ షాపుల్లో ఈ పోస్ యంత్రాలు వినియోగం ఆగస్టు 1నుండి అమలులో వచ్చిందని, ఈ పథకం నియమావళి ప్రకారం ఎరువులు కావలసిన రైతులు, కౌలు రైతులు తమ వెంట ఆధార్‌ను చూపించి ఈ పోస్ యంత్రాల ద్వారా వేలిముద్రలు వేసి ఎరువులు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భముగా స్థానిక మహాలక్ష్మి ఫెర్టిలైజర్స్ షాపులో భార్గవ మహేష్ ఈ పోస్ యంత్రాల ద్వారా ఎరువుల సరఫరాను పరిశీలించారు. ప్రతి డీలరు తప్పనిసరిగా ఎరువులు ఈపోస్ యంత్రాల ద్వారానే సరఫరా చేయాలని, లేనిచో డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# వినూత్నంగా కాపుల నిరసనలు



ఆలమూరు :- కాపు ఉద్యమనేత ముద్రగడకు మద్ధతుగా మండల కేంద్రం ఆలమూరులో శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం మండలాధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాపు నేతలు రోజుకో వినూత్న రీతిలో నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కాపు నేతలు సోమవారం రిక్షాలు నడుపుతూ నిరసన తెలియజేయగా మంగళవారం పాడి గేదెలను కడుగుతూ వినూత్నంగా నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షులు చల్లా సత్యనారాయణ (నానాజీ), కార్యదర్శి ఎలుగుబంట్ల సాయిబాబు, చల్లా భూషణం, పురుషోత్తం వీర్రాజు, కోలా నాని, ఎలుగుబంట్ల బూరయ్య, కొమ్మిశెట్టి తాతారావు, నామన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టిడీపీ నిరంకుశ వైఖరే

# నా గెలుపునకు దిక్సూచి

### *41 డివిజన్ వైసీపీ అభ్యర్థిని రామలక్ష్మి*

కాకినాడ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు పూర్తయినప్పటికీ ప్రజలకు ఉపయోగపడింది ఏమీ లేదని, ఎన్నో బూటకపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన టిడీపీ ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తుందని విమర్శించారు.

మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని తెలుసుకున్న ప్రజలు వైసీపీ వెంటే ఉన్నారని, ఈ మార్పే తనను 41 డివిజన్ కార్పొరేటర్‌గా గెలవడం ఆమె ధీమా వ్యక్తం చేసారు. 41 డివిజన్‌లోని దాట్లవారి వీధిలో ప్రజల ఆవాసాల మధ్య డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలు దుర్వాసన భరించలేక ఇండ్లు ఖాళీ చేయడమే కాకుండా ఆనారోగ్యంపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. దీనిని బట్టి టిడీపీ చేస్తున్న అభివృద్ధి ఏంటో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఒక సామాజిక కార్యకర్తగా, రోటరీక్లబ్ మెంబరుగా, సూపర్‌బజారు కమిటీ సభ్యురాలుగా, రెడ్‌క్రాస్ మెంబరుగా ప్రజలకు ఎన్నో సేవలందించడం జరిగిందన్నారు. తెలుగు మహిళా చైతన్యవేదిక ద్వారా బాల కార్మికులనిర్మూలనకు నిరక్షరాస్యత నిర్మూలన, ఎయిడ్స్ నిర్మూలనకు వంటి అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి విద్యుత్ సరఫరాలో అధిక వోల్టేజీ వల్ల ఇండ్లలో టివీలు, ఫ్రిజ్‌లు కాలిపోయి ప్రజలు ఆర్థికంగా చాలా నష్టపోయారనీ, సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మత్తులు చేపట్టి విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా చాలా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం జరిగిందనీ, భవిష్యత్తులో 41 డివిజన్‌అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని రామలక్ష్మి హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో ఆమె వెంట వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

### - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్

### - పోలింగ్ కేంద్రాల పరిశీలన, అధికారులతో సమీక్ష

రాజమండ్రి : కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలు సజావుగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్.రమేష్‌కుమార్ జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయపరమైన అంశాలను తీసుకుని ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నామని, అధికారులు సమన్వయంతో సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. రానున్న 3, 4 రోజులు అప్రమత్తంగా ఉండి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా, టీమ్ వర్కుతో పనిచేయాలన్నారు. ఇప్పటి వరకూ చేసిన ఎన్నికల ఏర్పాట్లు బాగున్నాయని, ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు.

ఈ జిల్లాలో ప్రత్యేక సంస్కృతి ఉందని, హింసాత్మక సంఘటనలకు ప్రజలు తావివ్వరని అన్నారు. ఈ నమ్మకాన్ని ఇక్కడి ప్రజలు నిలబెడతారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఈ ఎన్నికల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. వెబ్‌కాస్టింగ్, ఆన్‌లైన్ మోనటరింగ్ విధానం అమలు చేయాలన్నారు. ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓటు వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రధానంగా యువత ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి 48 డివిజన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 29న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ నిర్వహించటానికి ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం 196 పోలింగ్ కేంద్రాల్లో 2,29,373 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు 216 మంది ప్రిసైడింగ్ అధికారులు, 216 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 723 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఫ్లైయింగ్‌స్క్వాడ్, స్టాటిక్ బృందం ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్‌రూమ్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్.రమేశ్‌కుమార్ సోమవారం ఉదయం కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలను పురస్కరించుకుని గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, రామారావుపేటలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వీటిని పరిశీలించిన ఆయన ఓటు వేయటానికి వచ్చిన దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. వీటి వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నింతరం విద్యుత్తు సరఫరా కొనసాగించాలని ఆదేశించారు. ఆయన వెంట కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఆర్డీవో రఘుబాబు, మున్సిపల్ కమిషనర్ అలీంబాషా, తహసీల్దారు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రోమాలు నిక్కపొడుచుకునేలా

# చిరు 151 "సై...రా" పోస్టర్

# చిత్రభాను



కూడా ప్రూవ్ చేసింది ఖైదీ నంబర్ 150 మూవీ.ఇక తన 151వ సినిమాగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బయోపిక్ తో వస్తున్నాడు చిరంజీవి. ఆ సినిమా టైటిల్ గా సైరా అని పెట్టారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కనున్న తాజా చిత్రం ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. సురేందర్‌రెడ్డి దర్శకుడు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు.

పద్దెమినిదవ శతాబ్దానికి చెందిన స్వాతంత్ర్య సమరసేనాని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వీరోచిత పోరాటానికి ద ృశ్యరూపంగా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. వివిధ భారతీయ భాషల్లో ఈ చిత్రాన్ని అనువాదం రూపంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని నేడు ప్రకటించారు. సై...రా నరసింహారెడ్డి అనే టైటిల్ ప్రధాన టైటిల్ కాగా..నరసింహారెడ్డి ఉపశీర్షికగా ఉంది. దాదాపు 150కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.

ముందుగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనే టైటిల్ నే పెట్టాలని నిర్ణయించినా.. తరువాత యూనివర్సల్ అపీల్ కోసం టైటిల్ ను మార్చాలని నిర్ణయించారు. ఒకేసారి తెలుగు తమిళ హిందీ మలయాళ భాషల్లో రిలీజ్ కు ప్లాన్ చేస్తుండటంతో అందుకు తగ్గట్టుగా మహావీర అనే టైటిల్ ను ఫిక్స్ చేశారన్న ప్రచారం జరిగింది.

1978లో పునాదిరాళ్లు సినిమాతో మొదలైన సినిమా ప్రస్థానం ఖైది నంబర్ 150 దాకా కొనసాగుతూనే ఉంది.చిరంజీవి నటించిన ప్రాణం ఖరీదు తన మొదటి రిలీజ్ అయిన సినిమాగా పరిగణలోకి తీసుకుంటారు. తెలుగు సినిమా స్థాయిని పెంచిన హీరో అంటే అది తప్పకుండా మెగాస్టార్ చిరంజీవి అని చెప్పొచ్చు. టాలీవుడ్ ని ఏలిన అతితక్కువమంది హీరోల్లో తొలితరం కథానాయకుల తర్వాత ఇప్పటివరకూ మళ్ళీ అంతటి క్రేజ్ ఉన్న హీరో మెగాస్టార్ ఒక్కడే . చిరు స్టామినా ఏమిటో పదేళ్ల తర్వాత

# ఏడాది తర్వాత..



మహిళా ప్రధాన చిత్రాలు, ప్రయోగాత్మక కథాంశాలతో తమిళంలో ప్రతిభను చాటుకుంటున్నది నయనతార. కోలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న ఆమె టాలీవుడ్‌లో అడపాదడపా నటిస్తున్నది. దాదాపు ఏడాది విరామం తర్వాత తెలుగులో ఆమె ఓ సినిమా చేస్తున్నది. సింహా, శ్రీరామరాజ్యం తర్వాత బాలక ృష?, నయనతార కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రానికి కె.యస్. రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవలే ప్రారంభమైంది.

ప్రస్తుతం హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుగుతున్నది. సోమవారం నుంచి నయనతార చిత్రీకరణలో పాల్గొంటున్నది. నిర్మాత మాట్లాడుతూ శక్తివంతమైన కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. బాలక ృష?, నయనతార కెమిస్ట్రీ అలరిస్తుంది. నయనతార పాత్ర సరికొత్త పంథాలో ఉంటుంది అని తెలిపారు. బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్‌రాణా, మురళీమోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: ఎం.రత్నం, కెమెరా: సి.రాంప్రసాద్, సంగీతం: చిరంతన్‌భట్.

# వాడికెందుకు? వాడి అయ్య జాగీరా?....



విజయ్‌దేవర కొండ, షాలిని హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. సందీప్‌రెడ్డి వంగా దర్శకుడు. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మాత. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ సంచలనకామెంట్స్ చేశారు.

'అర్జున్ రెడ్డి' సినిమా 3 గంటలు తీయడాన్ని కొందరు సోషల్ మీడియాలో విమర్శలు చేయడంపై తమ్మారెడ్డి స్పందిస్తూ..... వాడికెందుకయ్యా? వాడి అయ్య జాగీరా? మూడు గంటలు సినిమా తీస్తడు, 30 గంటలు సినిమా తీస్తడు. నిర్మాత, దర్శకుడు, హీరో సినిమాను నమ్ముకుని సినిమా తీస్తారు అని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో 3 గంటలట సినిమా అంటూ కామెంట్ చేస్తున్నారు కొందరు... ఏమైతది? వాడి పైసలా? నచ్చకపోతే వాడు చూడొద్దు? అంటూ ఘాటుగా స్పందించారు తమ్మారెడ్డి. ఇంకొడెవడో వస్తడు... ముద్దు పెట్టుకున్నారంట ఏందయ్యా అని? విమర్శిస్తడు. ముద్దు పెట్టుకుంటే నీదేంబోయిందయ్యా? రాకు నువ్వు థియేటర్‌కు? అన్నీ వీళ్లకే కావాలి. పోనీ మంచి సినిమా తీస్తే చూస్తరా? అంటూ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు తమ్మారెడ్డి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నేత వి.హనుమంతరావు అర్జున్ రెడ్డి ముద్దు పోస్టర్లను చించేసిన సంగతి తెలిసిందే. ముద్దు పెట్టడు, మూడు గంటలు సినిమా తీయడు నువ్వు రిలీజ్ చేస్తవా? హెల్ప్ చేస్తవా? ఎవ్వడేం చెయ్యడు. సోషల్ మీడియాలో, రాజకీయ నాయకులు, కొందరు పిచ్చోళ్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. సినిమా వాళ్లు ఊరికే దొరికారు కదా అని ఎవరు పడితే వారు రాయి వేయడం అలవాటయిపోయింది... అని తమ్మారెడ్డి మండి పడ్డారు.

ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా ప్రేక్షకులు మాకు సపోర్టుగా ఉన్నారు. సోషల్ మీడియాలో అలా మాట్లాడే వారిని మీరంతా బాయ్ కాట్ చేయాలని కోరుకుంటున్నాను. సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను అంటూ తమ్మారెడ్డి వ్యాఖ్యానించారు.



# సంగీతం మహా సముద్రం



తొలిసారి రాజకీయ నేపథ్యంలో...

ఇప్పటివరకు నేను రాజకీయ నేపథ్య చిత్రానికి సంగీతాన్నందించలేదు. అందుకే నా కెరీర్‌లో నేనే రాజు నేనే మంత్రి చిత్రాన్ని ప్రత్యేకంగా భావిస్తున్నాను. స్క్రిప్ట్ విన్నప్పుడే ఉద్విగ్నతకు లోనయ్యాను. రానా పాత్రలో భిన్న పార్శ్వాలు కనిపించాయి. మనసును కదిలించే సంగీతాన్నదించేందుకు మంచి అవకాశంలా అనిపించింది. ఇక దర్శకుడు తేజతో ఎన్నో ఏళ్లుగా ప్రయాణం చేస్తున్నాను. ఆయన అభిరుచులేమిటో బాగా తెలుసు. ఈ సినిమాలో పాటలతో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగుందని అందరూ ప్రశంసిస్తున్నారు. నేపథ్య సంగీతం సన్నివేశాల్లోని భావోద్వేగాలకు మరింత గాఢతను అద్దిందని అందరూ మెచ్చుకుంటున్నారు.

**పాటలు కథ చెబుతాయి....**

నేనే రాజు నేనే మంత్రి చిత్రంలో సాధారణ పంథాకు భిన్నంగా సంగీతాన్నందించే అవకాశం లభించింది. ఈ చిత్రంలోని పాటలు కూడా కథలోని భావాన్ని ఆవిష్కరిస్తూ సాగుతాయి. అందుకే ప్రేక్షకుల హ ృదయాల్ని హత్తుకునేలా స్వరరచన చేసే వీలు కలిగింది. కథలోని భావాలకు అనుగుణంగా పాటలు సాగితే వాయిద్యాల్ని అనుకున్న విధంగా ఉపయోగించుకోవచ్చు. ఈ సినిమాలో ఎక్కువగా వయొలిన్, కోరస్ బ్యాక్‌గ్రౌండ్‌ను వాడాను.

**సావిత్రి కుదరలేదు...**

ఆరేళ్ల క్రితం వెంకటేష్ కథానాయకుడిగా తేజ దర్శకత్వంలో సావిత్రి పేరుతో ఓ సినిమా చేయాలనుకున్నారు. ఆ సినిమాకు నేను కొన్ని బాణీలను సమకూర్చాను. అనుకోని కారణాల వల్ల ఆ చిత్రం కార్యరూపం దాల్చలేదు. ఆ చిత్రం కోసం తయారుచేసుకున్న ఓ బాణీని జోగేంద్ర జోగేంద్ర పాట కోసం తీసుకున్నాను.

**ప్రతిరోజు నేర్చుకోవాల్సిందే..**

సంగీతం మహా సముద్రంలాంటిది. ప్రతి రోజు కొత్త విషయాన్ని నేర్చుకుంటూ వుండాలి. ప్రతి ఆరు నెలలకొకసారి మార్కెట్‌లో కొత్త వాయిద్య పరికరాలు వస్తుంటాయి. వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయితేనే ట్రెండ్‌కు తగినట్లుగా సంగీతాన్నందించగలుగుతాం. నేను సంగీతాన్ని ఎంతగానో ప్రేమిస్తాను. ఒక్కో హీరో దగ్గర ఒక్కో ప్రత్యేకత వుంటుంది. వారి ఇమేజ్‌ను బట్టి సంగీతాన్ని అందించాలి. యువ దర్శకులతో పనిచేయడాన్ని ఎక్కువగా ఇష్టపడతాను. వారు సంగీతపరంగా స ృజనాత్మకంగా ఆలోచిస్తుంటారు.

**అఖిల్ పాట పాడాడు..**

ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న పైసా వసూల్ చిత్రంతో పాటు అఖిల్ హీరోగా విక్రమ్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి సంగీతాన్నందిస్తున్నాను. బాలకృష్ణ వంటి సీనియర్ హీరోతో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది. సినిమాలో ఆయన పాడిన పాట వైరల్‌గా మారింది. ఇక విక్రమ్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో అఖిల్‌తో ఓ పాట పాడించాను. అతని గళం చాలా బాగుంటుంది. త్వరలో ఈ పాటను విడుదల చేయబోతున్నాం.



## భీమ్-యపిఐ, భారత్ క్యూఆర్ యాప్‌లకు

# ఈపీడీపీఎల్ విస్తృత ప్రచారం



విశాఖపట్నం: విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు ఏపీఈపీడీసీఎల్ బిల్లింగ్ వ్యవస్థతో అనుసంధానించబడిన భీమ్-యపిఐయాప్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది సిఎండి ఎంఎం నాయక్‌పిలుపునిచ్చారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఈఆర్ఓ సిబ్బందికి, రెవెన్యూ క్యాషియర్లకు మంగళవారం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఏటిసీ భవనంలో భీమ్-యపిఐ, భారత్ క్యూఆర్ యాప్‌లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ్‌లో సీఎండి నాయక్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు సిబ్బంది కృషి చేయాలని అందులో భాగంగా విద్యుత్ బిల్లులను సులభతరంగా, సమయం వృధా కాకుండా బిల్లు చెల్లించే విధంగా వినియోగదారులకు తెలియజేయాలని అన్నారు. భారత ప్రభుత్వ ఆదేశానుసారం చెల్లింపులు 100 శాతం నగదు రహితంగా జరగాలనే ఉద్దేశ్యంతో భీమ్-యపిఐ, భారత్ క్యూఆర్ యాప్‌లను ప్రారంభించిందని వీటిని ఈపీడీసీఎల్ వినియోగదారులంతా వినియోగించుకునే విధంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని సందేహాలున్న వినియోగాదరులకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ టివియస్ చంద్రశేఖర్, సిజిఎం జి. శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక దినోత్సవ వేడుకల పోస్టర్ విడుదల

ఆంధ్రవిశ్వవిద్యాలయం : పపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహణలో విద్యార్థులకు నాలుగు అంశాలలో పోటీలను నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తెలిపారు. విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్, క్విజ్, పేపర్ ప్రెజెంటేషన్, టూరిజం ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తారమన్నారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలలో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతోందన్నారు. పర్యాటక శాఖ ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ప్రాంతీయ కేంద్రంగా పోటీల నిర్వహణ బాధ్యత అప్పగించిం దన్నారు. విజేతలకు పర్యాటక దినోత్సవం రోజున జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేస్తారన్నారు. ఈ సంవత్సరం పర్యాటక దినోత్సవాన్ని 'సస్టైనబుల్ టూరిజం-ఏ టూల్ ఫర్ డెవలప్‌మెంట్' అంశంపై నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సుస్థిత పర్యాటకం-అభివృద్ధికి సాధనం అనే అంశంపై పెయిటింగ్ నిర్వహించాలన్నారు. పేపర్ ప్రెజెంటేషన్ పోటీలలో టూరిజం-ఏన్ ఎకనామిక్ అండ్ సోషల్ ఫినామినన్, అర్బన్ టూరిజం అండ్ కల్చరల్ హెరిటేజ్, హాస్పిటాలటీ, టూరిజం మేనేజ్‌మెంట్ అండ్ మార్కెటింగ్, టూరింజం అండ్ ఎన్విరాన్‌మెంట్, ఎంటర్‌ప్యూనర్‌షిప్ ఇన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ, సస్టైనబుల్ టూరిజం ఏ టూల్ ఫర్ డెవలప్‌మెంట్, జిఐఎస్ అప్లికేషన్స్ ఇన్ టూరిజం, డెస్టినేషన్ మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్, టూరిజం ప్లానింగ్ నీజినల్ డెవలప్‌మెంట్, న్యూ ట్రెప్స్ ఆఫ్ టూరిజం అంశాలపై పేపర్ ప్రెజెంటేషన్ చేయవచ్చునన్నారు.

## కిట్ స్పాన్సర్‌పై

# కోహ్లీ సేన అసంతృప్తి



దిల్లీ: ఆటకు సంబంధించిన కిట్లను పంపిణీ చేసే స్పాన్సర్‌పై కోహ్లీ సేన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే జట్టులోని ఆటగాళ్లు సమస్యను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు. వారు బీసీసీఐకి సమాచారం అందించారు. దీనిపై బీసీసీఐ కూడా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత పదేళ్లుగా నైక్ సంస్థ టీమిండియాకి కిట్లను పంపిణీ చేస్తోన్న విషయం తెలిసిందే. అతి త్వరలో నైక్ సంస్థ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించే దిశగా చర్చలు నిర్వహిస్తామని బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీ తెలిపారు. గత కొద్ది రోజులుగా ఆటగాళ్లు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని కిట్లు అదనంగా ఆటగాళ్లకు అందుబాటులో ఉంచాలని కోరినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదని, వచ్చే వారంలో దీనిపై సీఓఏ మీటింగ్‌లో చర్చిస్తామని ఆయన చెప్పారు. 2006లో నైక్ బీసీసీఐకి సుమారు 43మిలియన్ డాలర్లు చెల్లించి ఒప్పందం చేసుకుంది.

ఆ తర్వాత 2011లో 60మిలియన్ డాలర్లు చెల్లించి మరో ఐదేళ్లకు ఒప్పందాన్ని పెంచుకుంది. 2015లో 57మిలియన్ డాలర్లు చెల్లించి 2020వరకు ఒప్పందాన్ని పునరుద్ధరించుకుంది.

# రెండేళ్ల తరువాత వన్డే జట్టులోకి..



ఆంటిగ్వా:నవమారు రెండేళ్ల సుదీర్ఘ విరామం తరువాత డాషింగ్ ఓపెనర్ క్రిస్ గేల్ కు వెస్టిండీస్ వన్డే జట్టులో చోటు దక్కింది. ఇటీవల భారత్ తో జరిగిన ట్వంటీ 20 మ్యాచ్ లో ఆడిన గేల్.. విండీస్ తరపున వన్డే ఆడి 29 నెలలు అయ్యింది. 2015 మార్చిలో గేల్ చివరిసారి వన్డే జట్టులో కనిపించాడు. ఆ తరువాత ఇంతకాలానికి గేల్ కు వన్డే జట్టులో స్థానం కల్పించారు. ఇంగ్లండ్ తో వన్డే సిరీస్ లో భాగంగా గేల్ కు చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు 15 మంది సభ్యులతో కూడిన జట్టును విండీస్ ప్రకటించింది. గేల్ తో పాటు మార్లోన్ శామ్యూల్స్ కు విండీస్ వన్డే జట్టులో చోటు దక్కింది. 2016 అక్టోబర్ లో శామ్యూల్స్ చివరగా వన్డే ఆడాడు. ఈ ఇద్దరి ఎంపిక జట్టుకు అదనపు బలాన్ని తీసుకొస్తుందని క్రికెట్ వెస్టిండీస్ సెలక్షన్ ప్యానల్ చైర్మన్ కర్టనీ బ్రౌన్ అభిప్రాయపడ్డారు. దాంతోపాటు వీరి అనుభవం యువ క్రికెటర్లకు లాభిస్తుందని బ్రౌన్ పేర్కొన్నారు. అయితే ఆల్ రౌండర్ డ్వేన్ బ్రేవో కు చోటు కల్పించకపోవడానికి అతను పూర్తి ఫిట్ నెస్ తో లేకపోవడమేనని తెలిపారు. వచ్చే ఏడాది బ్రేవో పునరాగమనం చేసే అవకాశం ఉందన్నారు.

# 'ధోని వల్ల అతనికి నష్టం'



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని కెరీర్ కు సంబంధించి ఏదొక రూపంలో విమర్శలు వెలుగుచూస్తునే ఉన్నాయి. ఇటీవల శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్ కు ధోనిని ఎంపిక చేయడాన్ని మాజీ ఆటగాడు గౌతం గంభీర్ తీవ్రంగా తప్పుబట్టాడు. 2019 వరల్డ్ కప్ ను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేశామని టీమిండియా సెలక్టర్లు చెబుతున్న నేపథ్యంలో గంభీర్ స్వరం పెంచాడు. ధోని వరల్డ్ కప్ లో కొనసాగాలంటే అతను అప్పటి వరకూ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉందంటూ గంభీర్ చురకలంటించాడు.

'మెరుగ్గా ఆడితే ధోని వరల్డ్ కప్ వరకూ కొనసాగుతాడు అని చీఫ్ సెలక్టర్ ఎంఎస్ కే ప్రసాద్ చెప్పారు. అది అతనికి మాత్రమే పరిమితమా. మిగతా వారికి ఆ అవకాశం ఎందుకు లేదు. ధోనికి ఒక నిబంధన.. వేరే ఆటగాళ్లకి మరొక నిబంధనా. ఎవర్నీ ఎంపిక చేసినా అది వారి ప్రస్తుత ఫామ్‌పైనే ఆధారపడుతుంది కదా. గతంలో సాధించిన ఘనతలు పెద్దగా పరిగణలోకి తీసుకునే పరిస్థితి ఉండదు కదా. మరి ఫామ్ లోని ధోని ఎంపిక ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదు. అంటే వచ్చే వరల్డ్ కప్ వరకూ ధోనిని ఏదొక రకంగా కొనసాగించాలనే ఉద్దేశం సెలక్టర్లలో ఉంది. ఇలా చేస్తే చాలామంది ఆటగాళ్లు నష్టపోతారు. ఇక్కడ మరొక వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్‌ను తీసుకోండి. అతను అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు.

# సూర్య గ్రహణాన్ని వీక్షించిన ట్రంప్ ఫ్యామిలీ



వాషింగ్టన్: కండ్లకు ఎటువంటి ప్రొటెక్షన్ లేకుండా నేరుగా సూర్య గ్రహణాన్ని చూడరాదు. గ్రహణ సమయంలో శాస్త్రవేత్తలు ఇచ్చే అడ్వైస్ ఇదే. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం ఆ సలహా పాటించలేదు. అమెరికాను ఆదివారం గ్రేట్ ఎక్లిప్స్ పట్టేసింది. ఆ సంపూర? సూర్య గ్రహణాన్ని వైట్‌హైజ్ నుంచి వీక్షించారు ట్రంప్. ఆయన భార్య మెలానీయా ట్రంప్ కూడా ఆ ఖగోళ అదుతేాన్ని కనులారా చూశారు. ట్రూమన్ బాల్కనీ నుంచి ట్రంప్ దంపతులిద్దరూ గ్రహణాన్ని వీక్షించారు. సరిగ్గా సంపూర? సూర్య గ్రహణం పట్టే సమయంలో బాల్కానీలోకి వచ్చిన ట్రంప్ కొద్ది సేపు ఆ గ్రహణాన్ని కంటికి ఎటువంటి ప్రొటెక్షన్ లేకుండానే చూసేశారు. ఎలా ఉంది గ్రహణం అని రిపోర్టర్లు అడిగితే.. సూపర్ అని కూడా ఆయన సమాధానం ఇచ్చారట.

అయితే మరీ కీలక సమయంలో మాత్రం ట్రంప్ తన కంటికి అద్దాలు పెట్టుకుని గ్రహణాన్ని వీక్షించారు.

ఫస్ట్ లేడీ మెలానియా, కుమారుడు బారన్ ట్రంప్ కూడా ఆ సెలస్టియల్ అందాలను తనవితీరా తిలకించారు. ఫస్ట్ డాటర్ ఇవాంకా ట్రంప్ కూడా గ్రహణాన్ని వీక్షించారు. వాషింగ్టన్ డీసీలో ఉన్న ఎయిర్ అండ్ స్పేస్ మ్యూజియం నుంచి ఆమె గ్రేట్ ఎక్లిప్స్‌ను చూశారు

## సుజల స్రవంతి పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి

# ఉత్తరాంధ్రాను ఆదుకోవాలి



గాజువాక: సాగునీరు, త్రాగు నీరు సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ఉత్తరాంధ్ర యన్.టి.ఆర్ సుజల స్రవంతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి శతాబ్ది కాలంగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదుర్కోంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని గాజువాక తెదేపా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రాజధాని అమరావతి లో నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి నీటి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టిసీమను సకాలంలో పూర్తి చేసినందుకు, ప్రతిష్టాత్మకంగా పోలవరం ప్రొజెక్టు నిర్మాణం శరవేగంతో జరుగుతున్న అభివృద్ధి పనులపై కృతజ్ఞతలు తెలియజేసారు. సకాలంలో వర్షాలు పడక ఉత్తరాంధ్ర ప్రజలు నీటి సమస్యను ఎదుర్కోంటున్నారని అన్నారు. పరిశ్రమలు, గృహ వినయోగ నిమిత్తం ప్రస్తుతం ఉన్న నీటి వనరుల కంటే 50యం.జి.డిలు అదనంగా మంచినీరు అవసరమని అన్నారు. యన్.టి.ఆర్ సుజల స్రవంతి పథకాన్ని తక్షణమే ప్రారంభించి ఉత్తరాంధ్రను నీటి సమస్యనుంచి గట్టెక్కించాలని కోరారు. దీని ద్వారా లక్ష యాబైరెండుఎకరాల భూమి సాగుచేయడానికి వీలు కలుగుతుందని అన్నారు. దీనిపై తక్షణమే మంత్రి దృష్టి పెట్టి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# హరిత వినాయకునిపై గీతంలో ర్యాలీ




సాగర్‌నగర్: వినాయకచవితి పర్యావరణహితమైన పండుగగా జరపాలని ముఖ్యంగా ప్రమాదకర రసాయనాలతో కూడిన విగ్రహాలను, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసే విగ్రహాలకు దూరంగా ఉండాలని కోరుతూ గీతం విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం విద్యార్థులు మంగళవారం విశ్వవిద్యాలయం ఆవరణలో భారీ ర్యాలీని నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.అరుణలక్ష్మి ర్యాలీని ప్రారంభిస్తూ వినాయకచవితి పండుగకు ప్రకృతితో సంబంధం ఉందని ముఖ్యంగా మట్టితో తయారుచేసిన ప్రతిమలను పూజించటం వివిధ రకాల ఔషధ గుణాలు గల మొక్కల ఆకులను పూజకు ఉపయోగించటం ద్వారా తిరిగి ప్రకృతిలో వాటిని నిమజ్జనం చేయటం ఆవరణ వ్యవస్థను వృద్ధి చేయడానికి దోహదపడుతుందన్నారు. గీతం పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ మారుతి మాట్లాడుతూ ఏటా వినాయకచవితి సమయంలో మట్టి ప్రతిమలను విద్యార్థులకు, అధ్యాపకులకు పంపిణీ చేస్తున్నామని ఈ ఏడాది దాదాపు వెయ్యికి పైగా ప్రతిమలను పంపిణీ చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ స్వామి ఆధ్వర్యంలో పలువురు సీనియర్ ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# భార్యతో కలిసి శబరిమల వెళ్లిన ఏసుదాసు



కేరళ: ప్రముఖ గాయకుడు ఏసుదాసు పవిత్ర పుణ్యక్షేత్రం శబరిమల వెళ్లారు. ఇంతకుముందు చాలాసార్లు ఆయన అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. కానీ ఈ సారి తనసతీమణి ప్రభను కూడా వెంటతీసుకెళ్లారు. ఇద్దరూ కలిసి స్వామివారికి నెయ్యాభిషేకం నిర్వహించారు.

అంతేకాదు ఆలయం మూసివేసే సమయంలోఆయన హ్రివాస్నం అనే పాట కూడా పాడారట. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వామివారిని ద్రించుకోవడం ఎంత ప్రశాంతంగా ఉందో మాటల్లో చెప్పలేనని అన్నారు. భక్తులను సమానంగా చూసే ఏకైక పుణ్యక్షేత్రం శబరిమల. మతం, కులానికి ఇక్కడ స్థానం లేదు. ఇక్కడికి వచ్చేవారందరినీ స్వామి, అయ్యప్ప, మణికంఠ, మలికపురం అనిసంబోధిస్తారు అని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు ఏసుదాసు.




VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com